ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5


అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 6 డిసెంబరు 2024

కనకమహాలక్ష్మికి నీరాజనం

మార్గశిర తొలి గురువారం పోటెత్తిన భక్త జనం

విశాఖలోని బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున మూడు గంటల నుంచే క్యూలైన్లు భక్తులతో కిక్కిరిశాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. - వార్త 8వ పేజీలో..



విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ప్రగడ నాగేశ్వరరావు

విశాఖ చేరుకున్న సీఎం

- విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన నేతలు
- పార్టీ కార్యాలయంలో బస

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ముంబై నుంచి ఇక్కడకు వచ్చిన ఆయనకు ఎయిర్‌పోర్టులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి, పంచకర్ల, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేషన్ చైర్మన్లు గండి బాబ్జీ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, పీలా గోవింద సత్యనారాయణ, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, సీపీ శంకబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డీఐజీ గోపీనాథ్ జట్టీ, వీఎంఆర్‌డీ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, తదితరులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎయిర్‌పోర్టు నుంచి చంద్రబాబునాయుడు పార్టీ కార్యాలయానికి చేరుకుని, ప్రాంగణంలో నిలిపివుంచిన బస్సులో బస చేశారు.

నేడు డీప్ టెక్నాలజీ సదస్సుకు హాజరు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుస్తారు. 9.25 గంటలకు బయలుదేరి నోవాటెల్ హోటల్‌కు చేరుకుని 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. సాయంత్రం 6.15 గంటలకు నోవాటెల్ నుంచి బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుని, 6.45 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.



విశేష అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

భూ సమస్యలకు పరిష్కారం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 753 గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

- వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో 753 రెవెన్యూ గ్రామాలు
- రెవెన్యూ సభల షెడ్యూల్ విడుదల
- భూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్న రెవెన్యూ అధికారులు
- 45 రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు



గత వైసీపీ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిన సంగతి తెలిసిందే. రీసర్వే పేరుతో కాలం వెళ్లదీసిందే తప్ప భూ యజమానుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదు. భూముల సమగ్ర రీసర్వే మాటున వైసీపీ నాయకులు ప్రభుత్వం భూములను తమ పేరున మార్చుకున్నట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. జిరాయి భూములకు సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకంలో వున్న విస్తీర్ణం కన్నా తక్కువ చూపించారు. వీటిపై 'స్పందన' కార్యక్రమంలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం భూ సమస్యలకు పరిష్కారం చూపాలని నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లాలో 753 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ టెలీకాన్ఫరెన్స్‌లో మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామ సభల్లో ఫ్రీహోల్డ్, 22ఏకు సంబంధించిన భూములు, ఇతరత్రా భూ సమస్యలు, వివాదాలపై వినతులు స్వీకరిస్తారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి సదస్సుల నిర్వహణకు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. మండల రెవెన్యూ అధికారులు రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటలకు సదస్సులు ప్రారంభం అవుతాయి. తహసీల్దారు, ఆర్‌ఐ, సంబంధిత వీఆర్‌ఓ, సర్వేయర్, రిజిస్ట్రేషన్ శాఖ ప్రతినిధి, అటవీ, దేవదాయ, వక్ఫ్ బోర్డు సిబ్బందితో కూడిన బృందాలు రెవెన్యూ సదస్సులకు హాజరవుతాయి. ఏ రోజు, ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సు జరుగుతుందో ముందుగానే ఆయా గ్రామాల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలకు తెలియపరచాలి. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చిన అర్జీలకు రశీదులు ఇచ్చి, వివరాలను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ప్రభుత్వం చెప్పిన మేరకు భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం చూపాల్సి వుంటుంది.

పారదర్శకంగా దీపం-2 పథకం



- రాష్ట్ర వ్యాప్తంగా 81 లక్షల కుటుంబాలు ఈకేవైసీ
- ఆర్థిక ఇబ్బందులున్నా.. హామీలు అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



మీడియాతో మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. పక్కన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

అనకాపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం దీపం-2 పథకాన్ని పారదర్శకంగా అమలుచేస్తున్నదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన ఈ సందర్భంగా అనకాపల్లిలో మీడియాతో మాట్లాడారు. దీపం-2 పథకం కింద వంద శాతం సబ్సిడీపై ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు పొందడానికి రాష్ట్రంలో ఇంత వరకు 81 లక్షల కుటుంబాలు ఈకేవైసీ చేయించుకున్నాయని మంత్రి వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో 2.2 లక్షల గ్యాస్ కనెక్షన్లు వుండగా, ఇంతవరకు 1.75 లక్షల కనెక్షన్లకు సంబంధించి లబ్ధిదారులు మొదటి సిలిండర్ బుక్ చేసుకున్నారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వచ్చే ఏడాది మార్చి వరకు ఒక్కో గ్యాస్ కనెక్షన్‌కు ఒకటి చొప్పున సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రతి నాలుగు నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ ధరను తొలుత లబ్ధిదారులు చెల్లించాలని, గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు 24 గంటల్లో డబ్బులు జమ అవుతాయన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీల్లో ఒకటైన ఉచిత వంట గ్యాస్ సిలిండర్ (దీపం-2) కోసం ఏటా రూ.2,840 కోట్లు వ్యయం చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఏ ఇతర పథకాల్లో లేనంతమంది లబ్ధిదారులు దీపం-2 పథకంలో ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం చంద్రబాబునాయుడు కృతనిశ్చయంతో వున్నారని, మిగిలిన హామీలను కూడా సంక్రాంతిలోపు అమలు చేయాలనే మంచి ఆలోచనతో ముందుకు వెళుతున్నారని మనోహర్ చెప్పారు. మీడియా సమావేశంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

రూ.లక్షల్లో వసూలు చేస్తున్న కొన్ని ఐటీ కంపెనీలు

- ఇటీవల రూ.3 లక్షల వరకూ తీసుకుని బిచాణా ఎత్తేసిన ఓ సంస్థ
- షూరిటీ పేరిట రూ.3 లక్షలు చెక్కులు తీసుకున్న మరో సంస్థ
- ఎందుకూ పనికి రారంటూ వేధింపులు
- ఉద్యోగం మానేస్తామంటే రూ.లక్షలు కట్టాలని డిమాండ్
- పోలీసులను ఆశ్రయించినా ప్రయోజనం శూన్యం
- యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ సెటిల్‌మెంట్
- ఉద్యోగం కోసం డబ్బులు అడిగితే... ఆ సంస్థను అనుమానించాల్సిందేనంటున్న ఐటీ నిపుణులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో కొన్ని ఐటీ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయి. ఉద్యోగార్థుల నుంచి డబ్బు దోచుకోవడానికి యత్నిస్తున్నాయి. వాటికి పోలీసులు సహకరిస్తున్నారు. నగరంలోని ఒక పోలీస్ స్టేషన్‌లో కొద్దిరోజుల క్రితం ఇలాంటి కేసు ఒకటి సెటిల్‌మెంట్ జరిగింది. ఉద్యోగం మానేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ.1.5 లక్షలు చొప్పున యాజమాన్యం ముక్కు పిండి వసూలుచేసింది. ఇది నగరంలో కొత్త ట్రెండ్.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగం స్లంపులో ఉంది. అందరికీ ఉద్యోగ అవకాశాలు రావడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోను అదే పరిస్థితి. ఉత్తరాంధ్రాలో బీటెక్ చేసి బయటకు వస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటోంది. దీనిని కొన్ని కంపెనీలు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నాయి. ఐటీలో ఉద్యోగాలు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నాయి. ఫలానా కంపెనీ, ఫలానా తేదీన ఇంటర్వ్యూలు అని చెప్పి రప్పించుకుంటున్నాయి. ఉద్యోగం కావాలంటే కంపెనీకి డిపాజిట్ కట్టాలంటూ లక్ష రూపాయల నుంచి మూడు లక్షల రూపాయల వరకూ కట్టించుకుంటున్నాయి. ఆఫర్ లెటర్ ఇచ్చి, ఆ తరువాత అడ్రస్ లేకుండా పోతున్నాయి. డబ్బులు కట్టినవారు ఇంటర్వ్యూ జరిగిన ఆఫీసుకు వెళ్లి అడిగితే...ఆ ఒక్కరోజుకు వారికి అద్దెకు ఇచ్చామని, అది వారి ఆఫీస్ కాదని చెబుతున్నారు. గ్రీన్ పార్క్ హోటల్ సమీపాన పెద్ద భవంతిలో ఈ తరహా మోసం కొద్దినెలల క్రితం జరిగింది. వారి చేతిలో సుమారు 40 మంది వరకు మోసపోయారు. సుమారు రూ.70 లక్షల వరకు వసూలు చేసుకొని ఆ సంస్థ బిచాణా ఎత్తేసింది.

ఇలా చేస్తే మోసం చేస్తున్నట్టే..!

- ఏ కంపెనీ అయినా ఉద్యోగం ఇస్తామని చెప్పి డబ్బులు వసూలు చేయకూడదు. అలా చేస్తే మోసం చేస్తున్నట్టే భావించాలి.
- గ్యారంటీ, డిపాజిట్ పేరుతో అడ్వాన్స్ చెక్కులు కూడా తీసుకోకూడదు. ఇది క్రిమినల్ కేసు కిందకు వస్తుంది. ఇది కూడా మోసమే.
- శిక్షణ ఇచ్చాక ఉద్యోగం ఇస్తామని కొన్ని సంస్థలు చెబుతాయి. ఆ శిక్షణకు డబ్బులు వసూలు చేస్తాయి. ఇలాంటి అంశాల్లో క్లారిటీ అవసరం. అది ట్రైనింగ్ ఇనిస్టిట్యూటా?, ఐటీ కంపెనీయా?...అని ధ్రువీకరించుకోవాలి. శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగాలు ఇవ్వని సంస్థలు అనేకం ఉన్నాయి.

ఉద్యోగం ఇచ్చాక వేధింపులు

నగరంలో ఉన్న ఓ ఐటీ కంపెనీ ఈ ఏడాది మార్చి నెలలో బీటెక్ పాసైన వారికి ఇంటర్వ్యూలు ... మిగతా 8వ పేజీలో

ఇన్‌చార్జులతో కాలక్షేపం!

జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో మందగించిన పాలన

- ఐదు నెలలుగా భర్తీకి నోచుకోని జోనల్ కమిషనర్ పోస్టు
- టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల్లోనే ఇదే పరిస్థితి
- ప్రజలకు సేవల్లో తీవ్రజాప్యం



జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోనల్ కార్యాలయంలో ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. సాధారణ బదిలీల్లో ఇక్కడి నుంచి కొంతమందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేసిన ఉన్నతాధికారులు.. వారి స్థానాల్లో ఇంతవరకు ఎవరినీ నియమించలేదు. దీంతో జోన్‌లో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. కీలక విభాగాల పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు.

జీవీఎంసీ జోనల్ కమిషనర్ పోస్టు ఐదు నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న జోనల్ కమిషనర్‌ను కాకినాడకు బదిలీ చేశారు. ఆ స్థానంలో ఎవరినీ నియమించలేదు. జీవీఎంసీ కమిషనర్ కార్యాలయంలో కార్యదర్శి హోదా కలిగిన ఒక అధికారిని అనకాపల్లి జోనల్ కమిషనర్‌గా నియమించారు. ఇంకా పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాల్లో కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలు వుండడంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు ఇన్‌చార్జిలుగా ఉన్నవారు సైతం సమీక్షలు, సమావేశాల పేరుతో తరచూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళుతున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు నిరాశతో తిరిగి వెళ్లిపోతున్నారు.

సాధారణ బదిలీల్లో భాగంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు స్థాన చలనం కలిగింది. ఆ స్థానంలో ఎవరినీ నియమించకుండా గాజువాక జోనల్ కార్యాలయం ఏసీపీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయన వారంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే అనకాపల్లి వచ్చి వెళుతున్నారు. ఇదే విభాగంలో టౌన్ ప్లాన్ సూపర్‌వైజర్, బిల్డింగ్ అబ్జర్వర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగంలో కీలక పోస్టులు ఇన్‌చార్జిలతో కొనసాగుతుండడంతో భవన నిర్మాణ ప్లాన్‌లు, మార్టిగేజ్ విడుదల, అనధికార నిర్మాణాల కూల్చివేత, ఆక్రమణల తొలగింపు వంటి చర్యలు నిలిచిపోయాయి. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టాల్సిన వారు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా.. పలుమార్లు కార్యాలయానికి రావాల్సి వస్తున్నది. పట్టణ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించి వివిధ పథకాల అమలు బాధ్యతను చూడాల్సిన మెప్మా ఏపీడీ పోస్టు ఏడాది నుంచి ఖాళీగా వుంది. ఇక పట్టణ ప్రజల ఆరోగ్య పరిస్థితులను ... మిగతా 8వ పేజీలో

డీఆర్‌ఓగా సత్యనారాయణరావు

బాధ్యతలు స్వీకరణ

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్యనారాయణరావు

జిల్లా రెవెన్యూ అధికారిగా వైఎస్‌వీకేజీఏ స్‌ఎల్ సత్యనారాయణరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. ఇప్పటి వరకు డీఆర్‌ఓగా పనిచేసిన బలి వాడ దయానిధి వీఎంఆర్‌డీఏ ఎస్‌డీసీగా ఇటీవల బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న సత్యనారాయణరావును ప్రభుత్వం అనకాపల్లి డీఆర్వోగా నియమించిన విషయం తెలిసిందే.

బలిఘట్టం ఆలయానికి మహర్దశ

అన్నవరం దేవస్థానం దత్తత

- నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో కార్యక్రమం

నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):

స్థానిక మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో వున్న సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం శుక్రవారం నుంచి దత్తత తీసుకోనున్నది. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమక్షంలో అన్నవరంలో ఆలయ అధికారులు దత్తత కార్యక్రమాన్ని నిర్వహించ నున్నారు. బలిఘట్టంలో శతాబ్దాల క్రితం వెలసిన సత్యనారాయణస్వామి ఆలయం వరహా నది గట్టుకి అవతల వైపు ఉండేది. 1990 మే నెలలో సంభవించిన తుపాన్‌కు వరహా నదికి భారీగా వరద పోటెత్తడంతో ఆలయం తీవ్రంగా దెబ్బతిన్నది. చాలా ఏళ్ల తరువాత 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.45 లక్షలతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టింది. సుమారు రూ.75 లక్షలతో ఆలయాన్ని ఆనుకొని కల్యాణ మండపం నిర్మించడానికి కృషి చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో కల్యాణ మండపం నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండి పోయాయి. ఇదిలావుండగా స్వామివారి ఆలయానికి బలిఘట్టం, గుండుపాలలో సుమారు 30 ఎకరాల వ్యవసాయ భూములు వున్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయంతోపాటు హుండీల కానుకలతో ఆలయంలో ధూప, దీప, నైవేద్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి అంతంత మాత్రంగానే ఆదాయం ఉండడంతో ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత తీసుకుంటే అభివృద్ధి జరుగుతుందన్న ఉద్దేశంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ విషయాన్ని దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో శుక్రవారం అన్నవరంలో జరిగే బలిఘట్టం శీసత్యనారాయణస్వామి ఆలయ దత్తత స్వీకార కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు పాల్గొంటారు. దత్తత అనంతరం బలిఘట్టం ఆలయానికి మహర్దశ కలుగుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బలిఘట్టంలో సత్యనారాయణస్వామి ఆలయం

కనకదుర్గ గోల్డ్ లోన్స్ ప్రారంభం



కనకదుర్గ గోల్డ్ లోన్స్ శాఖను ప్రారంభిస్తున్న జీఎం చంద్రశేఖరరెడ్డి, తదితరులు

అచ్యుతాపురం,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ రంగంలో గత 41 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న కనకదుర్గ ఫైనాన్స్ లిమిటెడ్, కనకదుర్గ గోల్డ్ లోన్స్ తమ సంస్థ నూతన శాఖను అచ్యుతాపురంలో గురువారం ఉదయం ప్రారంభించినట్టు జీఎం. జె.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తమ సంస్థకు ఆర్‌బీఐ గుర్తింపు ఉందన్నారు. తమ సంస్థ రూ.5 వేలు నుంచి రూ.50 లక్షల వరకు అతి తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. బంగారంపై ప్రతి గ్రాముకు అత్యధికంగా ఫైనాన్స్ లభిస్తుందన్నారు. వ్యాపార, వ్యక్తిగత రుణ సౌకర్యానికిమా సంస్థ ఎంతగానో దోహద పడుతుందని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.కార్యక్ర మంలో ఏజీఎం కె.నగేష్, బ్రాంచ్ మేనేజర్ కె.గోవింద, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య శ్రీరాముని ధనస్సుకు పూజలు



శ్రీరాముని ధనస్సును పూజిస్తున్న భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి గురువారం చేరుకున్న అయోధ్య శ్రీరాముని ధనస్సుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తుల దర్శనార్థం ఆలయ ఆవరణలో ఉంచారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ శ్రీరామ చంద్రుడు 14 సంవత్సరాల వనవాసానికి ప్రతీకగా కిలో బంగారం, 13 కిలోల వెండితో ధనస్సును తయారు చేయించినట్టు ఆయన తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ పుణ్యక్షేత్రాలలో శ్రీరాముని ధనస్సుకు పూజలు చేసి, 2025 ఏప్రిల్ 6వ తేదీ తరువాత అయోధ్య బలరామ మందిరానికి బహూకరిస్తామన్నారు.

32,619 మందికి టీడీపీ సభ్యత్వం

» ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను

మునగపాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకు విశేషస్పందన లభిస్తూనే ఉంటుందని ఏపీ గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనువాసరావు తెలిపారు. గురువారం ఆయన సభ్యత్వ నమోదుపై విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోను సభ్యత్వ నమోదు జరుగుతోందన్నారు. నియోజకవర్గంలో 2,06,479 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 32,619 మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఏపీ రోడ్లు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ప్రోత్సాహంతో మరింత పెరగనుందన్నారు.

పాఠశాలకు సరస్వతి విద్యా వేదిక అంకితం

» నిర్మించిన 1995-96 పూర్వపు విద్యార్థులు



మునగపాక జడ్పీ స్కూల్లో వేదిక నిర్మించిన పూర్వ విద్యార్థులు

మునగపాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మించిన సరస్వతి విద్యా వేదికను గురువారం విద్యార్థులకు అంకితం చేశారు. మునగపాక జడ్పీ హైస్కూల్‌లో 1995-96 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.2.5లక్షలతో రేకుల రూఫ్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం ఎం.శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, మాడెం జోగారావు, మారిశెట్టి ఆనంద్‌లకు పూర్వవిద్యార్థులు అప్పగించారు.

మూలపర్రలో తాగునీటికి ఇక్కట్లు



బావి వద్ద నీరు తోడుకుంటున్న మహిళలు

నక్కపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం శివారు మూలపర్ర గ్రామంలో వారం రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత నీటి పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోవడం, గ్రామంలో బోర్లు ఏమీ లేకపోవడంతో మహిళలు బిందెడు నీళ్ల కోసం అల్లాడిపోతున్నారు. కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. మహిళలు గ్రామంలో వున్న ఒక బావి వద్ద నీటిని బిందెలతో ఇంటికి తీసుకెళ్తున్నారు. గ్రామంలో నిలిచిపోయిన మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ



బోయపాడు పాఠశాలకు కంప్యూటర్ అందజేసిన హెటెరో ప్రతినిధులు

నక్కపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు జడ్పీ హైస్కూల్, బోయపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు గురువారం హెటెరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం కంప్యూటర్లను అందజేసింది. సుమారు రూ 2.5లక్షలు విలువైన మూడు కంప్యూటర్లను పాఠశాలలకు హెటెరో ప్రతినిధులు ఎస్. కుల్లారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎన్.రాజారెడ్డి, ఎన్‌వీవీ సత్యనారాయణ రెడ్డి ఆ పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో హెటెరో సీఎస్‌ఆర్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మండలంలో శ్రీరాంపురంలో సచివాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నారు. ఈనెల 9న ఈదటం, 10న కుమారపురం, 12న మాసాహెబ్‌పేట, 13న సత్యవరం, 16న గోపాలపట్నం, 17న పెంటకోట, 18న గుంటపల్లి, 19న నామవరం, 20న అరట్లకోట, 21న రాజవరం, 23న పాల్తేరు, 24న కేశవరం గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామన్నారు. అదేవిధంగా 26వ తేదీ ఉదయం ఎస్.నర్సాపురం, మధ్యాహ్నం కందిపూడి, 27న పెదరాంభద్రపురం, 28న పీఎల్.పురం, 30న మంగవరం, 31వ తేదీన పాయకరావుపేటలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కోటవురట్లలో..

ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎల్. తిరుమలబాబు కోరారు. ఈనెల 6న కైలాసపట్నంను, 10న వీకేపల్లిలో, 11న చినబొడ్డేపల్లిలో, 12న పాములవాకలో, 13న కొడవటిపూడి, కె.వెంకటాపురంల్లో, 17న బోడపాలెంలో, 18న టిజగ్గంపేటలో, 19న చౌడువాడలో, 20న గొట్టివాడలో, 21న పందూరులో, 24న పీరామన్నపాలెంలో, 26న రాజుపేటలో, 27న అన్నవరంలో, 28న బీకేపల్లి, రామచంద్రపాలెంల్లో. 31న జల్లూరులో, జనవరి 2న తంగేడులో, 3న సుంకపూర్‌లో, 4న యండపల్లిలో, 5న కోటవురట్ల, కేబీ అగ్రహారంలో, 6న లింగాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. అందిన ఫిర్యాదులను 40 రోజులోగా పరిష్కరిస్తామన్నారు.

ఎస్.రాయవరంలో..

ఈనెల ఆరో తేదీ నుంచి జనవరి నెల నాలుగో తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమేష్‌బాబు తెలిపారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. శుక్రవారం లింగరాజుపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తామన్నారు.

రాంబిల్లిలో..

ఈనెల 6 నుంచి జనవరి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 6న మురకాడ, 9న మురకాడ, 10న కట్టుబోలు, 11న దిమిలి, 12, 13న వెల్చూరు, 16న లాలంకోడూరు, 17న జడ్.చింతువా, 18న పెదకలవలాపల్లి, 19న కేజీ పాలెం, 20న రాంబిల్లి, గోవిందపాలెం, కొత్తపట్నం, వాడ నర్సాపురం పంచాయతీలకు రాంబిల్లిలోను, 21న హరిపురం, 23న పంచదార్ల, 24న జడ్.చింతువా, 26న లాలంకోడూరు, 27న వెల్చూరు, 28న రాజుకోడూరు, 30న రాజుకోడూరు, 31న కట్టుబోలు జనవరి 2న కట్టుబోలు, 3,4న గోకివాడ, 6.7న మామిడివాడ గ్రామాల్లోని సచివాలయాలు వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామాల రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

ఎలమంచిలిలో..

మండలంలో శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు వరహాలు తెలిపారు. శుక్రవారం పీఎస్‌ఆర్‌పేట రెవెన్యూ బయ్యవరంలో రెవెన్యూ సదస్సు ప్రారంభమవుతుందన్నారు.

ప్రతి రోజూ ప్రతి గ్రామంలోనూ భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

సమానత్వాన్ని కల్పించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ.సత్యనారాయణమూర్తి

పాయకరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం అన్ని రంగాల్లోనూ దళిత బహుజనులు, మైనార్టీలు, మహిళలకు సమానత్వాన్ని కల్పించిందని, మనమంతా రాజకీయంగా మరింత చైతన్యవంతులం కావడం ద్వారా రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం స్థానిక మంగవరంరోడ్డులోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 'సనాతన ధర్మమా?-సమధర్మమా?'పై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కాలంలో సనాతన ధర్మంపై చర్చ ఎక్కువగా జరుగుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి స్వయంగా సనాతన ధర్మాన్ని కాపాడుతానని ప్రకటించడం, విజయవాడ దుర్గమ్మ గుడిమెట్లు కడగడంతో ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఒక మతాన్ని భుజానికి ఎత్తుకోవడం రాజ్యాంగబద్ధంగా ఎంతవరకు సమంజసమనే అంశంపై చర్చ జరుగుతోందన్నారు. సనాతన ధర్మం అంటే మను ధర్మమేకదా? అటువంటి ఈ అంశంపై బీజేపీగాని, దాని మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌గాని, ఇతర పెద్దలు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. చదువుకున్న దళిత బహుజనులంతా అధికారం, సంపదల్లో వాటాని అడుగుతున్నారని, కాబట్టి మళ్లీ సనాతన ధర్మం పేరుతో మనుధర్మాన్ని అమలుచేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా మనమంతా రాజకీయంగా మరింత చైతన్యవంతులం కావడం ద్వారా అంబేడ్కర్ ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోగలమన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జేవీ.ప్రభాకర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, డీహెచ్‌పీఎస్ నాయకులు డీసీహెచ్.రాజబాబు, వడలి శివప్రకాష్, పెద్దాడ లోవరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బందుల సుబ్బలక్ష్మి, ఉప్పాడ సత్తిబాబు, వడ్లమూరి సత్తిబాబు, ఎస్ఎంబీ చర్చి అధ్యక్షులు బీజేవీ.ప్రసాద్, ముస్లీం నాయకులు ఎండీ రుహుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో కాలనీ రోడ్డుకు మోక్షం కలిగేనా?



రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయానికి వెళ్లే రోడ్డు దుస్థితి

ఎలమంచిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని రామ్‌నగర్ వార్డులోని టిడ్కో కాలనీ రోడ్డు చినుకు పడితే కాలనీవాసులకు చుక్కలు చూపుతోంది. ఈ కాలనీలో 420 ప్లాట్లు పంపిణీ చేసిన గత ప్రభుత్వం రహదారి సౌకర్యంతోపాటు ఇతర వసతులు కల్పించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు స్థానిక నేతలు ముందుకు వచ్చి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు చినుకు పడితే చాలు బురదమయంగా మారుతోంది. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి టిడ్కో కాలనీకి రోడ్డును వేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయాలి

» రాష్ట్ర మాల సంఘాల జేఏసీ మహిళా కన్వీనర్ నాగమల్లీశ్వరి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, క్రీమీలేయర్ తీర్పును రద్దుచేయాలని డిమాండ్ చేస్తే అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హలో మాల - చలో గుంటూరు పేరిట ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న మాలల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ మహిళా కన్వీనర్ డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ ఆధ్వర్యంలో పాత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించి ప్రసంగించారు. మాలలు ఐక్యంగా ఉండి ఈనెల 15వ తేదీన గుంటూరులో నిర్వహించనున్న మాలల మహాగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి ఎస్సీ వర్గీకరణను రద్దుచేస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత నాయకులు సిద్ధాంతపు కొండబాబు, తంతటి కిరణ్, కండివల్లి లోవరాజు, ఇంజరపు సూరిబాబు, ఐఎస్.మూర్తి, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, కువల కుమార్, చిరికూరి పేర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి

» డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి ఆదేశం

పాయకరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు ఈనెలాఖరునాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్‌ఆర్‌ఈజీఎస్, తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఈజీఎస్‌కి సంబంధించి హౌసింగ్ స్కీమ్‌లో 90 రోజులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు ఈనెలాఖరునాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఎస్‌ఆర్‌జీఎస్ పనుల్లో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని, ఈ ఏడాది టార్గెట్‌ని మార్చినాటికి పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావుతోపాటు, హౌసింగ్ ఏఈ వై.ప్రతాప్, ఎస్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ భాగ్యలత, ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ, పంచాయతీ కార్యదర్శులు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఈవోపీఆర్‌డీ



కొబ్బరితోటలో ప్రజలతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నామని ఈవోపీఆర్‌డీ సీహెచ్.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన పట్టణంలోని వీవర్స్‌కాలనీ కొబ్బరితోటలో ఇళ్ల మధ్య కొత్తగా ఏర్పాటుచేయనున్న సెల్ టవర్ నిర్మాణ పనులను ఆపివేయాలని అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేశారు. ఈ సందర్భంగా సెల్ టవర్ ఏర్పాటుచేయనున్న స్థలాన్ని పరిశీలించారు. దీనిపై అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని శ్రీరాంపురంలో శానిటేషన్ పనులు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సీహెచ్‌ఆర్‌కే.వర్మ, వైవీ. సత్యనారాయణ పాల్గొన్నారు.

మండలంలో మూడు గంటలు పవర్ కట్

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సత్యవరం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని మంగవరం, అరట్లకోట, ఎంఎస్.పేట, సత్యవరం, గోపాలపట్నం, పెంటకోట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నీరా ట్రాడీ టాపర్స్ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబుకు సన్మానం



కుడిపూడి సత్తిబాబును సన్మానిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ, నీరా ట్రాడీ టాపర్స్ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబుకు గురువారం మండలంలోని కోనవానిపాలెం వద్ద ఘన స్వాగతం లభించింది. మాజీ సర్పంచ్ కట్టా అప్పలకొండ ఆధ్వర్యంలో 25 గీత కార్మికుల సొసైటీల ప్రతినిధులు సత్తిబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్తిబాబు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. నియోజకవర్గంలో యాత కమిటీ భవనం నిర్మాణంపై హోం మంత్రి అనితతో కూడా మాట్లాడతానన్నారు. ఈనెల 15న నిర్వహించనున్న చలో రాజమండ్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం కొరుప్రోలుకి చెందిన హోమియోపతి డాక్టర్ పద్మప్రియను, క్రీడల్లో రాణిస్తున్న పాయకరావుపేటకు చెందిన వీరలక్ష్మి, వెంకటలక్ష్మిలను చైర్మన్ సత్తిబాబు సత్కరించారు. కార్యక్రమంలో దమ్ము అప్పారావు, రాంబాబు, బత్తిన జగ్గారావు, వెంకటేష్, పోలవరపు శ్రీను, గుత్తుర్తి పాండురంగ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 13వ తేదీ నుంచి 2 రోజులు పాటు నిర్వహించే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ కోరారు. గురువారం స్థానిక బస్టాండ్ జంక్షన్ వద్ద సంఘ ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ పోరాటాల వల్ల ఎంతోమంది విద్యార్థులకు న్యాయం జరిగిందన్నారు. జిల్లా మహాసభలను విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ కె.మణికంఠ, రవి. రాము. అజయ్‌రాజు, సునీల్, అలేఖ్య, భవానీ, జ్యోతి, రాజేశ్వరి, లహరి పాల్గొన్నారు.

నేడు ఐదు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా శుక్రవారం స్థానిక మంగవరం రోడ్డు, గొల్లలపేట, రాజుగారిబీడు, బీడీఓ లేఅవుట్, పీఎస్‌ఆర్.నగర్, కరణంగారివీధి, కుమ్మరవీధి, పెదపీర్ల పంజావీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

దిబ్బపాలెంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని దిబ్బపాలెం మాజీ సర్పంచ్ బైలపూడి లక్ష్మీభవానీ అన్నారు. గురువారం దిబ్బపాలెంలో మహిళలకు కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి వద్దే ఉంటూ కుట్టు శిక్షణ ద్వారా ఆర్థికంగా మహిళలు ఆర్జించవచ్చన్నారు. ఈ కేంద్రంలో 50 మంది మహిళలకు కుట్టుశిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. సెజ్‌లోని సెయింట్ గోబిన్ అద్దాల కర్మాగారం సీఎస్‌ఆర్ నిధులతో ఈ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యమాంబ పండగ



ముత్యమాంబను దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తిలో ముత్యమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ప్రహరీ నిర్మాణ పనులను తెలుగుదేశం నాయకుడు రెడ్డి నగేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తమండలి సభ్యులు రెడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నరసింహనాయుడు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పీఏసీఎస్ గోదాము

వేసవిలో మరమ్మతులు చేపట్టాలంటున్న రైతులు



శిథిలావస్థలో ఉన్న పీఏసీఎస్ గోదాము

రాంబిల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఏసీఎస్ గోదాము శిథిలావస్థకు చేరుకుంది. ఈ గోదామును 1987లో నిర్మించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి విక్రయించేందుకు ఈ గోదామును నిర్మించారు. గోదాము శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాలకు కారిపోతోంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఈ గోదాము ద్వారా పీఏసీఎస్ సిబ్బంది రైతులకు ఎరువులు, విత్తనాలు వంటివి సరఫరా చేస్తుంటారు. వర్షాలకు గోదాము శ్లాబ్ నుంచి వర్షం నీరు గదుల్లోకి వచ్చేస్తుందని, దీంతో ఎరువులు, విత్తనాలు తడిసిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ వేసవిలోనైనా గోదాముకు మరమ్మతులు జరిపితే ఎరువులకు ఎటువంటి నష్టం ఉండదని రైతులు సూచిస్తున్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం



సాయిల్ హెల్త్‌కార్డులను అందజేసిన ఏఓ సుమంత

రాంబిల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్టుబోలు గ్రామంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి జి సి.సుమంత మాట్లాడుతూ నేల కోతను అరికట్టడం, పచ్చిరొట్ట ఎరువులు, జిప్సం వాడడం ద్వారా భూసారాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో పేరెంట్స్ సమావేశం రేపు

రాంబిల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వ తేదీన మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఎం. సూర్యారావు తెలిపారు. మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలో ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని ఆయన కోరారు.

121 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీ సాయి ధ్యాన మందిరంలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 121 మంది పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దుర్గాభవానీ పరీక్షలు చేసి 35 మందికి ఆపరేషన్లు నిర్వహించాలని నిర్ధారించినట్టు క్యాంపు మేనేజర్ అరుణ్‌కుమార్ తెలిపారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి బస్సులో తీసుకు వెళ్లినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సాయిభక్తులు బొడ్డేడ వీరేంద్ర, మళ్ల అప్పలనాయుడు, నర్సింగ్ అమృత, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి : ముగ్గురి అరెస్టు

ఎస్.రాయవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేపీపాలెం గ్రామ శివారులో ఉన్న కొండ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి. వారి నుంచి రూ 9,600 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితోపాటు దాడి చేసినట్టు చెప్పారు.

కూటమి ప్రభుత్వంలోనే రోడ్లన్నీ అభివృద్ధి

- పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్
- ఏఎంఏఎల్ కాలేజీ జంక్షన్ వద్ద రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొత్తూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు కాలేజీ కూడలి వద్ద గురువారం ఆయన వంతెన నుంచి శారదానది వంతెన వరకు నిర్మాణం చేపట్టనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రూ. 2.7 కోట్లతో ఏఎంఏఎల్ కళాశాల కూడలి వద్ద ఉన్న రోడ్డుతో పాటు కిలో మీటరు పరిధిలో ఉన్న బీటీ రోడ్డును వెడల్పు చేసి అభివృద్ధి చేస్తామని వివరించారు. అనంతరం కొత్తూరు పంచాయతీ రామాలయం వీధిలో దీపం-2 పథకం కింద మహిళలకు గ్యాస్ సిలెండర్లను అందజేశారు. లబ్ధిదారుడైన కందుల ఈశ్వరరావు గృహానికి వెళ్ళి గ్యాస్ స్టౌ వెలిగించి టీ చేసి మంత్రికి ఇచ్చారు. ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అన్ని హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నట్టు చెప్పారు. ముందుగా అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డు వద్ద ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్ని బాలాజీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఆర్డీవో షేక్ ఆయుషా, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి, తహసీల్దార్ విజయకుమార్, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు మయం.. మలుపుల భయం..

విస్తరణకు నోచుకోని పి.బోనంగి- పాలవలస రహదారి

- వెడల్పు చిన్నదిగా ఉండడంతో తరచూ ప్రమాదాలు
- ఇటుగా రాకపోకలు అంటేనే వాహనదారులు హడల్



బోనంగి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ఓ మలుపు



పరవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.బోనంగి- పాలవలస ఆర్అండ్ బీ రహదారి విస్తరణకు నోచుకోవడం లేదు. ఎనిమిదేళ్ల క్రితమే ప్రభుత్వం ఈ రహదారిని విస్తరించేందుకు ప్రతిపాదనలు చేసింది. అప్పటి ఉమ్మడి విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ రెండుమూడు దఫాలు రహదారిని పరిశీలించేందుకు వచ్చారు. ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలోని జాజులవానిపాలెం నుంచి పి.బోనంగి మీదుగా పాలవలస ఆర్ అండ్‌బీ రహదారి ఉంది. పాలవలస వద్ద గల హిందుజా పవర్ ప్లాంటుకు రాకపోకలు సాగించే వారంతా ఇదే రహదారిని వినియోగించుకుంటున్నారు. అయితే రహదారి వెడల్పు చిన్నదిగా ఉండడంతో పాటు ఎక్కువగా మలుపుల కారణంగా రాకపోకలు సాగించే వారిలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు పి.బోనంగి, మరిసవానిపాలెం, వీఎల్ఎన్‌పురం, కలపాక, పిట్టవానిపాలెం, దాసరిపేట, అప్పికొండ, చినపాలెం, పెదపాలెంతో పాటు పలు గ్రామాలు ఈ రహదారికి అనుకుని ఉన్నాయి. రహదారికి ఇరువైపులా ఆనుకొని నివాసాలు ఉండడం వలన వాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. కంపెనీకి వెళ్లే భారీ వాహనాలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకోవాల్సిందే. చుట్టూ చీకటి, ఇరుకు రోడ్డు ఆపై అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు వెరసి ప్రమాదాలకు కారణమవుతున్నాయని పలువురు వాపోతున్నారు.

రహదారిని ఆనుకుని ఉన్న ఇళ్లు తొలగించాల్సి ఉంది

పి.బోనంగి- పాలవలస ఆర్అండ్ బీ రహదారి విస్తరణలో భాగంగా కలపాక, మరిసవానిపాలెం, బొనంగి, పిట్టవానిపాలెం, దాసరిపేట గ్రామాల్లో రహదారికి ఆనుకొని ఉన్న ఇళ్లను తొలగించాల్సి ఉంటుంది. ఇందు కోసం ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. నష్టపరిహారం కింద రూ.కోట్లలో ఖర్చు చేయాల్సి ఉంది. దీంతో అప్పటి ప్రభుత్వం రహదారి విస్తరణకు మొగ్గు చూపలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారిని విస్తరించడం వల్ల కేవలం హిందుజా పవర్ ప్లాంట్‌కే ఉపయోగమని, అందుకోసం రూ.కోట్లు వెచ్చించి రహదారి విస్తరించడంతో పాటు నష్టపరిహారం అందజేయడం ప్రభుత్వానికి తలకు మించిన భారమనే చెప్పాలి.

తరచూ ప్రమాదాలు

జాజులవానిపాలెం నుంచి పి.బోనంగి వెళ్లే క్రమంలో ఎక్కువగా మలుపులు ఉండడం వలన తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారికి ఆనుకుని ముళ్ల పొదలు వాటికి తోడు మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. రహదారిని విస్తరిస్తే ప్రమాదాలను చాలా వరకు అరికట్టవచ్చు. పరిసర గ్రామాల ప్రజలు రహదారిని విస్తరించాలని గత కొన్నేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయితే విస్తరణ ఇప్పటి వరకు ఎలాంటి కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్కువగా ప్రమాదాలు



పి.బోనంగి- పాలవలస ఆర్అండ్‌బీ రహదారిలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకు రోడ్డు, ఆపై ఎక్కువగా మలుపులు ఉండడమే ఇందుకు కారణం. ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై త్వరితగతిన స్పందించాలి. **- కేఆర్‌కే రాజు, పి.బోనంగి**

రహదారిని విస్తరించాలి



పి.బోనంగి- పాలవలస రహదారిని విస్తరించాలి. వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. ఇరుకు రోడ్డు వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రాకపోకలు సాగించాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకోవాల్సిందే. అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

- కరణం శైలజా, కలపాక

డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ

- పెండింగ్ కేసులపై తుహిన్‌సిన్హా ఆరా



డీఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పరవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ డివిజన్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం రాత్రి సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇక్కడికి విచ్చేసిన ఆయనకు డీఎస్పీ కేవీ సత్యనారాయణ స్వాగతం పలికారు. సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులు గురించి ఎస్పీ ఆరా తీశారు. ఆయా కేసుల పురోగతిని తెలుసుకుని సలహాలు, సూచనలు చేశారు. పెండింగ్ కేసుల్లో విచారణ వేగం చేయాలన్నారు. సైబర్ నేరాలు, రహదారి భద్రతా గూర్చి ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. చెడు వ్యసనాలు కలిగి ఉన్న వ్యక్తులపై నిఘా కొనసాగించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన కార్యకలాపాలు గూర్చి ఎస్పీ పలు సూచనలు చేశారు.

సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

- ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వడం తప్పనిసరి
- వారి అభిప్రాయాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి
- పరవాడ మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ 'పైలా'



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి

పరవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు అధికారులు గౌరవం ఇవ్వడంతో పాటు అభివృద్ధి విషయంలో వారి సూచనలను తప్పక పాటించాలని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి సూచించారు. ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి విషయంలో అందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. వాడచీపురుపల్లి పశు వైద్యాధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు వంద శాతం గాలికుంటు వ్యాధి వ్యాక్సిన్లు వేశామని వెల్లడించారు. గ్రామాల్లో పశువులకు వ్యాధులు సోకి చనిపోతున్నాయని, ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తే అధిక మొత్తంలో డబ్బులు గుంజుతున్నారని నాయుడుపాలెం ఎంపీటీసీ పైలా అక్కయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత కారణంగా ఈ పరిస్థితి నెలకొందని వైద్యాధికారి సమాధానమిచ్చారు. సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడతామని ఎంపీడీవో తెలిపారు. అమూల్ డెయిరీ పాడి రైతులకు గత కొంత కాలంగా బోనస్‌లు ఇవ్వడం లేదని రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు సభలో ప్రస్తావించారు. ఈ విషయాన్ని అమూల్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వాడచీపురుపల్లి వైద్యాధికారి సమాధానమిచ్చారు. తానాం గ్రామంలో ఇరిగేషన్‌కు సంబంధించిన కాలువపై పంచాయతీ తీర్మానం మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సీసీ డ్రైన్ల నిర్మించడం సబబేనా అని జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారుల ఆమోదం తెలిపాకే సీసీ డ్రైన్ నిర్మించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ జి.షణ్ముఖ వివరణ ఇచ్చారు. ముత్యాలమ్మపాలెంలో ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠాలు అన్యాక్రాంతమవుతున్నాయని ఎంపీటీసీ సూరాడ బంగార్రాజు వివరించారు. తహసీల్దార్ ఎస్‌వీ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద అధికమైందని, వీటి కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పరవాడ ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు తెలిపారు. వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సమాధానమిచ్చారు. హౌసింగ్, ఐసీడీఎస్, వైద్య తదితర శాఖల నుంచి అధికారులు మాట్లాడి ప్రజాప్రతినిధుల సమస్యలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మండల సమావేశానికి హాజరుకాని కార్మికశాఖ, హార్టీకల్చర్, ఇరిగేషన్ , మత్స్యశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు అందజేస్తామని ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు.

నేల సంరక్షణ బాధ్యత అందరిది



మార్టూరులో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ

తుమ్మపాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామంలో గురువారం అంతర్జాతీయ మృత్తికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి మాట్లాడుతూ నేల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేల బాగుంటేనే మానవ మానుగడ సాధ్యమవుతుందని వివరించారు. నేల సారవంతమైతే పదిహేను రకాల పోషకాలు కలిగిన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చునన్నారు. నేల నిస్సారమయితే పంటలలో నాణ్యత ఉండదని వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నేల సరంక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, వ్యవసాయాధికారులు శ్రీనివాస్, రవిరాజ్, ప్రవీణ్ , దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో తీర్థం, శఠగోపం ఇవ్వకపోవడం ఏమిటి?

నిర్వాహకుల తీరుపై మాజీ ఎమ్మెల్యే పీలా ఆగ్రహం



అనకాపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నూకాంబిక అమ్మవారి ఆల యంలో తీర్థం, శఠగోపం ఇవ్వక పోవడం పట్ల మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఆలయానికి విచ్చేశారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయనకు తీర్థం, శఠగోపం ఇవ్వకపోవడంతో నిర్వాహకుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద ఆలయాల్లో ఈ సంప్రదాయం ఉన్నప్పటికీ ఇక్కడ లేకపోవడం ఏమిటని సిబ్బందిని ప్రశ్నించారు. అదే సమయంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో సుజాత కూడా ఈ విషయమై సిబ్బందిని ప్రశ్నించారు. కరోనా సమయంలో అప్పటి నుంచి భక్తులకు తీర్థం, శఠగోపం ఇవ్వడాన్ని నిలిపివేశామన్నారు. ఇకపై అటువంటి పనులు మానుకొని ఆలయానికి వచ్చే భక్తులకు విధిగా తీర్థం, శఠగోపం ఇవ్వాలని ఆమె సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీ చిరంజీవి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు విశాఖలో ఆయనను కలిసి మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ అయిన ఉపాధ్యాయులను రాబోయే బదిలీల్లో స్పెషల్ కేటగిరిగా పరిగణిస్తూ తిరిగి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు కోరారు. ఎమ్మెల్సీ కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టీవీ రమణ, ఎన్.శ్రీనుబాబు ఉన్నారు.

'వైసీపీ పాలనలో అన్ని రంగాలు కుదేలు'

అనకాపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను ఆర్థికంగా కుదేలు చేసినందని, సమస్యలు సృష్టించిన జగన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలపై పోరాడుతానని చెప్పడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు మండిపడ్డారు. గురువారం టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు వరకు విద్యార్థులు చెల్లించాల్సిన రూ.3,500 కోట్ల ఫీజు రీయింబర్సుమెంట్ నిధులు విడుదల చేయకుండా దారి మళ్లించిందని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలపై రూ.72 వేల కోట్ల భారాన్ని మోపిన ఘనత జగన్‌రెడ్డికే చెందుతుందన్నారు. జగన్‌రెడ్డిని ఎన్నికల్లో తిరస్కరించిన ప్రజలు ఎన్ని పోరాటాలు చేసినా నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో వైసీపీ పాలకులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు సృష్టించినా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు వాటిని అధిగమించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు

భక్తిశ్రద్ధలతో మార్గశిర మాసోత్సవాలు



మహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దేవీపురంలో గురువారం మార్గశిర మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురుపత్ని అన్నపూర్ణమ్మ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా యంత్ర మహామేరులో కొలువైన మహాలక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కందర్ప ప్రభాకర్, రమా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండుగ



పరవాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నెలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము ఐదుగంటల నుంచి ఆలయం వద్దబారులు తీరారు. అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దంపతులతో పాటు ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, మాజీ ఎంపీటీసీ మాజీ పైలా రథాల సన్యాసిరావు, గ్రామ పెద్దలు వెన్నెల ఏకుల అప్పారావు, పైలా రమణాజీ, వెన్నెల నర్సింగరావు, పైలా అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయం త్రం మేళతాళాలు నడుమ ఘటాలను ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం జరిపారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీదేవిపేటలో స్వామివారికి భక్తుల పూజలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీదేవి పేటలో అభయాంజనేయస్వామి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పీలా తులసీరామ్, దొడ్డి జగ్గారావు, ఆడారి రాజు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం

- వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలు
- విక్రయించినా, వినియోగించినా జరిమానా
- 'ప్లాస్టిక్ రహిత విశాఖ' కోసం బీచ్‌రోడ్డులో ప్రతిజ్ఞ రేపు : జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. నగరంలో ప్రతిరోజూ 300 టన్నుల వరకూ ప్లాసిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. వాటిని శాస్త్రీయంగా పునర్వినియోగించుకునే అవకాశం లేకపోవడం సమస్యగా మారుతోందన్నారు. ప్లాసిక్ వ్యర్థాలు భూమిలో కలవడానికి కనీసం 500 సంవత్సరాలు పడుతుందని, వర్షాలు పడితే నీటితో కలిసి గెడ్డలు, కాలువల ద్వారా సముద్రంలో చేరుతున్నాయన్నారు. దీనివల్ల పర్యావరణం, సముద్ర జలాలు కలుషితమవుతున్నందున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని నిర్ణయించామన్నారు. వచ్చే నెల ఒకటి నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్‌ను నగరంలో విక్రయించడం, వినియోగించడం నిషేధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలతోపాటు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈలోగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈనెల ఏడో తేదీ ఉదయం 6.30 గంటలకు బీచ్‌రోడ్డులో 'ప్లాస్టిక్ రహిత విశాఖ' పేరుతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించబోమని ప్రతిజ్ఞ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి స్వచ్ఛ విశాఖ బ్రాండ్ అంబాసిడర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. గతంలో పలుమార్లు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం విధించినప్పటికీ అనివార్య కారణాల వల్ల పూర్తిస్థాయిలో సాధ్యపడలేదన్నారు. కానీ ఇప్పుడు మాత్రం శతశాతం నిషేధాన్ని అమలు చేస్తామన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల ఉత్పత్తిని పెంచేందుకు వ్యాపారులకు సహాయసహకారాలు అందిస్తామన్నారు. అలాగే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల మార్కెట్‌కు కూడా అవకాశాలు కల్పిస్తామన్నారు. గతంలో వీటి ధరలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కంటే చాలా ఎక్కువ ఉండడంతో కొనుగోలుదారులు వాటి జోలికి వెళ్లేవారు కాదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అందరూ విడనాడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

గొర్లివానిపాలెంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సబ్బవరం, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో గల ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్ప, సరస్వతి, నాగబంధం, పసిడి కళస విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పారాయణం, విఘ్నేష్వర పూజ, పంచగవ్య ప్రాశన తదితర పూజలను జరిపారు. ఈ కార్యక్రమంలో అలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు, ఎంపీటీసీ చైతన్య, గ్రామ పెద్దలు ఉమామహేశ్వరరావు, గండి దేముడు, గొంప సత్యనారాయణ, బాదిరెడ్డి లక్ష్మణ, త్రిమూర్తులు, శివ, నీలేశ్వరరావు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కశింకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోట జాతీయ రహదారిపై గురువారం కారు అదుపుతప్పింది. అనకాపల్లికి వెళ్లే రహదారిలోకి దూసుకొచ్చింది. విజయనగరం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు లారీని తప్పించే క్రమంలో డివైడర్ పైనుంచి అనకాపల్లికి వెళ్ళే మార్గంలోకి దూసుకొచ్చింది. ఆ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తున్నా ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పడమటమ్మ పండుగ పోస్టర్ ఆవిష్కరణ

కశింకోట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బయ్యవరం గ్రామ దేవత పడమటమ్మతల్లి పండుగ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ గురువారం అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు కమిటీ ప్రతినిధులు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యనారాయణ ఆలయ హుండీ లెక్కింపు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణస్వామి దేవస్థానంలో గురువారం హుండీ లెక్కింపు చేపట్టారు. కార్తీక మాసంలో భక్తుల ద్వారా హుండీ ఆదాయం రూ.లక్షా 43వేల 455లు లభించిందని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ మురళీ తెలిపారు. గత ఏడాది కార్తీక మాసంలో రూ.92,404లు వచ్చినట్టు చెప్పారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ. 51,051లు ఆదాయం పెరిగిందని వివరించారు. హుండీలో రెండు సింగ్‌పూర్ డాలర్లు, రెండు దుబాయ్ ధీరమ్స్ క్వాయిన్లు వచ్చాయన్నారు. ఈవో బి.మురళీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు పెంటకోట చంద్రరావు, సూరిశెట్టి బల్లమ్మ, శ్రీకాకుళం గణపతి, మారిశెట్టి భాస్కరరావు, తురకలపూడి హేమ, దొడ్డి భరత్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న డీఆర్‌వో దయానిధికి సత్కారం



దయానిధిని సత్కరిస్తున్న పార్టీల ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించి విశాఖపట్నం వీఎంఆర్‌డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న బి.దయానిధిని రాజకీయ పార్టీల ప్రతినిధులు గురువారం ఇక్కడ సత్కరించారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథబాబు, సీపీఎం నాయకులు ఆర్.శంకరరావులు దయానిధిని సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ డీఆర్‌వోగా దయానిధి చేసిన సేవలను కొనియాడారు.

పరాయిపంచన అంగన్‌వాడీ కేంద్రం

» ఎగువశోభ పంచాయతీ కొత్తవలసలో ఇరుకు గదుల్లో చిన్నారులకు అవస్థలు


అసంపూర్తిగా నిలిచిపోయిన కొత్తవలస అంగన్‌వాడీ కేంద్రం

అనంతగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎగువశోభ పంచాయతీ కొత్తవలస గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచింది. 2016-17లోని ట్రైబల్ వెల్ఫేర్‌నుంచి రూ. 7 లక్షల నిధులు ఈ భవనానికి మంజూరయ్యాయి. అనంతరం భవనం స్లాబ్, ప్లాస్టింగ్ పనుల వరకు పూర్తిచేశారు. తర్వాత టైల్స్, కిటికీలు ఇతర పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.7 లక్షల బిల్లుల కుగాను, రూ. లక్ష మాత్రమే బిల్లులు అందటంతో కాంట్రాక్టర్ పనులను నిలిచిపోయాయి. ఫలితంగా ఎనిమిదేళ్లుగా అద్దెకు తీసుకున్న భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం ఇరుకుగ్గా ఉండంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి, నిలిచిపోయిన పనులను పూర్తిచేసి, భవనం అందుబాటులోకి తీసుకువచ్చి, వసతి సమస్య పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు. .



ఇరుకు గదిలో చిన్నారులకు బోధన

మన్యంలో పోస్టల్ సేవలు విస్తరించాలి

» కలెక్టర్ దినేశ్‌కుమార్


పోస్టల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పోస్టల్ సేవలను మరింతగా విస్తరించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. తన కార్యాలయంలో పోస్టల్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ శాఖకు తాము సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అదనంగా ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 18 వేల మందికి ఆధార్ కార్డులు జారీ చేయాల్సి ఉందన్నారు. పోస్టాఫీసుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నగదు బదిలీ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు పోస్టల్ ఖాతాలు ప్రారంభించాలన్నారు. జిల్లాలో గ్రామ్‌సడక్ సర్వే పూర్తి చేశామని, రానున్న మూడేళ్లలో పూర్తి స్థాయిలో మారుమూల గ్రామాలకు సైతం రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.

ప్రభుత్వ పథకాల లబ్ధికి పోస్టల్ ఖాతాల మ్యాపింగ్

కర్నూలు రీజన్ పోస్టుమాస్టర్ జనరల్ ఉపేంద్ర మాట్లాడుతూ... ప్రజలకుఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం అనేక పోస్టల్ పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 434 పోస్టాఫీసులున్నాయన్నారు. ఖాతాదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు వీలుగా అవసరమైన మ్యాపింగ్ ప్రక్రియను చేస్తున్నామన్నారు. అలాగే కిసాన్ సమ్మాన్, సుకన్య సమృద్ధి యోజన, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్సు, పాస్ సేవా కేంద్రాలు, ఆధార్ కార్డు నమోదు సేవలు అందిస్తున్నామన్నారు. పోస్టల్ పొదుపు ఖాతాలు, నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్ల జారీ గురించి వివరించారు. పోస్టల్ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలను చేరువచేస్తున్నట్టు వివరించారు. ఈసమావేశంలో అనకాపల్లి పోస్టల్ అధికారి కె.శ్రీనివాస్, పాడేరు పోస్టల్ ఇనస్పెక్టర్ వై.దిలీప్, సీపీవో కేఎస్ఆర్‌కే.పట్నాయక్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ లక్ష్మి సేవలు ఆదర్శనీయం


పాతకోట ఆశ వర్కర్ బుర్ది లక్ష్మిని సన్మానిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

హుకుంపేట డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతకోట పంచాయతీకి చెందిన ఆశ వర్కర్ బుర్ది లక్ష్మి సేవలు ఆదర్శనీయమని ఉప్ప పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రతాప్, రేఖ అన్నారు. గురువారం వర్కర్ లక్ష్మీ పదవీ విరమణ సందర్భంగా ఆమె వైద్య సిబ్బంది సన్మానించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ లక్ష్మి తన పరిధిలోని గ్రామాల్లో తిరిగి చిత్తశుద్ధితో వైద్య సేవందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మురళి, సౌజన్య , లలితదేవి, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లుపాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు


దారెలలో టీడీపీ సభ్యత్వం నమోదులో పాల్గొన్న డివిజన్ నేత పాండురంగ స్వామి

ముంచంగిపుట్టు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకులు విధిగా పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవాలని ఆ పార్టీ డివిజన్ నేత పి.పాండురంగ స్వామి అన్నారు. మండలంలోని దారెల, బంగారుమెట్ట పంచాయతీల పరిధిలో గురువారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. సభ్యత్వ నమోద ప్రమాద బీమా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంపార్టీ మండల తోధకులు సామర్ల బాబూజీ, నాయకులు కిల్లో లైకేన్, సహదేవ్, సోనాదోర్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని మండలాలివి..

పాడేరురూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో ఈ నెల 6వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎన్ఎం అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. డుంబ్రిగూడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందున ఆ మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. చింతపల్లి సబ్ స్టేషన్ పరిధిలో తాజంగి, లంబసింగి, జెర్రిలగెడ్డ, అంజలిశనివారం గ్రామాలకు, జిమాడుగుల సబ్‌స్టేషన్ పరిధిలోని సొలభం, పెదలోచలి, వంతాల, గడుతూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. పాడేరు మండలం వంట్లమామిడి ఫీడర్ పరిధిలో వంట్లమామిడి, మినుములూరు, ఐనాడ, దేవాపురం గ్రామాలకు, అనంతగిరి మండలంలోని టైడ ఫీడర్ పరిధిలోని కొండిబ, పైనంపాడు, లుంగపర్తి, గుమ్మ, కివర్ల గ్రామాలకు, కొయ్యూరు మండలంలోని రాజన్నపాలెం ఫీడర్ పరిధిలోని డౌనూరు, ధర్మవరం, మల్లవరం, బచింత గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు పరీక్షిస్తున్న వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి

సీలేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించారు.. ఈసందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు.హెచ్‌వీ బాలమణి, ఆశ కార్యకర్త సంగీత, కరుణామణి పాల్గొన్నారు.

టీడబ్ల్యూ హెచ్‌ఎంలకు పదోన్నతి హర్షనీయం

» గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రేగం



పాడేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ విద్యాశాఖలో సీనియర్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న ఇద్దరిని డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారులు (డీఈవో)గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం హర్షించదగిన విషయమని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో టీడబ్ల్యూ సీనియర్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న కె.రవిప్రసన్నకుమార్‌ను సీతంపేట ఐటీడీఏలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఈవో), సీతంపేట ఐటీడీఏ పరిధిలో టీడబ్ల్యూ సీనియర్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.రామ్మోహనరావును కేఆర్.పురం ఐటీడీఏలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఈవో)గా పదోన్నతిపై నియమిస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

120 కిలోల గజాయి స్వాధీనం.. నలుగురు అరెస్టు


నిందితులతో సీఐ వినోద్‌బాబు, ఎస్సై వీరబాబు

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం నుంచి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్న 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్టు స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. వినోద్ బాబు తెలిపారు. గురువారం అన్నవరం పోలీసు స్టేషన్‌లో సీఐ విలేకరులతో మాట్లాడారు. ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సేకరించిన గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో అన్నవరం ఎస్సై జి.వీరబాబు, పోలీసులు లోతుగెడ్డ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారన్నారు. నలుగురువ్యక్తులు గోనె సంచుల్లో గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. వీరు చింతపల్లి, జీకేవీధి మండలాలకు చెందినవారని తెలిపారు. గంజాయి రవాణా ప్రధాన సూత్రధారి తమిళనాడుకు చెందిన వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు.

రాజ్‌మా పంటకు బీమాతో మేలు


మాట్లాడుతున్న ఎంపీపీ అనుషదేవి, జడ్పీటీసీ బాలయ్య

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు రాజ్‌మా పంటకు బీమా చేయించుకోవాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లగా రాజ్‌మా పంటను వాణిజ్య పంటగా పరిగణించి బీమా సదుపాయం కల్పించలేదన్నారు. ప్రస్తుతం 2024 రబీలో రాజ్‌మాకు ప్రభుత్వం ఫసల బీమా పథకం వర్తింపజేసిందన్నారు. ఈ బీమాతో ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటకు నష్టం జరిగితే పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు మీ సేవా కేంద్రాలకు వెళ్లి ఈనెల 15తేదీలోగా రూ.300 నగదు చెల్లించాల్సివుంటుందన్నారు. సాగు ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డులను తీసుకువెళ్లి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

డ్రగ్స్ నియంత్రణ బాధ్యత అందరిదీ : సీఐ


మద్దిగరువు సంతలో అవగాహన కల్పిస్తున్న సీఐ సన్యాసినాయుడు

జి.మాడుగుల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌ను నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ సన్యాసినాయుడు సూచించారు. డ్రగ్స్ (సంకల్పం)పై గురువారం మండలంలో నుర్మతి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు, అలాగే, మద్దిగరువు వారపు సంతలో గిరిజనులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్‌ను వినియోగం, విక్రయాలు నేరమన్నారు. వీటి వల్ల యువత జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. అలాగే, త్వరలో కిల్లంకోట, బొయితిలి, లువ్వాసింగి పంచాయతీల యువతకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తునట్లు సీఐ తెలిపారు.

సికిల్‌సెల్ ఎనీమియాతో వివాహిత మృతి


రాజకుమారి (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బకులూరు పంచాయతీ అంకంపాలెంలో ఓ వివాహిత సికిల్‌సెల్ ఎనీమియాతో బుధవారం రాత్రి మృతి చెందింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. అంకంపాలెం గ్రామానికి చెందిన పొట్టిక రాజకుమారి (20)కి రెండేళ్ల క్రితం రవికుమార్‌తో వివాహమైంది. వారికి ఏడాది క్రితం కుమార్తె పుట్టింది. కాగా రెండు రోజుల క్రితం వరకు వ్యవసాయ పనులు సైతం చేసుకున్న రాజకుమారి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడింది. దీంతో ఆమెను భర్త రవికుమార్, కుటుంబ సభ్యులు వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు బుధవారం మధ్యాహ్నం వరకు వైద్య సేవలు అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి రిఫర్ చేశారు. అక్కడ వైద్య సేవలు అందేలోగా ఆమె మృతి చెందింది. 2017 నుంచి రాజకుమారి సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతూ గత మూడేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల పింఛన్ అందుకుంటోంది. ఆమె ఏడాది కాలంగా ఆరోగ్యంగా తిరుగుతూ రెండు రోజుల క్రితమే అస్వస్థతకు గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి'


భిక్షాటనతో నిరసన తెలుపుతున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు గురువారం జిల్లా కేంద్రంలో వినూత్నంగా గాందేయ మార్గంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న తమను సీఆర్టీలుగా మార్పు చేసి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలంటూ ఐటీడీఏ కార్యాలయం వద్ద 20 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ. గిరిజన సంక్షేమ గురుకుల అవుట్ సోర్సింగ్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ జిల్లా నాయకులు కొండబాబు, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గురువులతో భిక్షాటన చేయించిన ఘనత జిల్లా అధికారులకే దక్కుతుందన్నారు. గిరిజన సంక్షేమ గురుకులాల్లో 2017లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చుచేసి.. 2010 పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచకుండా తమతో వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చాలీచాలని వేతనాలతో కుటుంబాలతో జీవిస్తున్నామన్నారు. నేటికి 20 రోజులుగా ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడుతున్నా అధికారులు స్పందించక పోవడం దారుణమన్నారు. అర్థాకలితో అలమటిస్తున్న తాము రోడ్డెక్కి భిక్షాటన చేయాల్సిన దుస్థితి వచ్చిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ


జీకేవీధిలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీలు ర్యాలీ చేపట్టారు. ఏవోబీ సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు వారోత్సవాలు జరుపుతున్నారు. ఈనేపథ్యంలో గురువారం ఆదివాసీలు జీకేవీధి వారపు సంతలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేశారు. వారోత్సవాల వల్ల గిరిజనులకు కలిగిన ప్రయోజనం ఏమిటీ?వారు గిరిజన ప్రాంతాన్ని విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులు అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. వారపు సంత నుంచి జీకేవీధి కాలనీ వరకు ర్యాలీ సాగింది.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ విద్యా బోధన

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల పైబడిన బాలబాలికలకు పూర్వ =ప్రాథమిక విద్యాబోధన అందిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో జీవీ రమణ అన్నారు. గురువారం రాజుపాకలు, కృష్ణాపురం, చింతలూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్'పై చిన్నారుల తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్య బోధన చేస్తున్నట్టు చెప్పారు. ఈ విద్యాభ్యాసం వల్ల విద్యార్థులు ఐదేళ్ల తరువాత పాఠశాల్లో చేరిన సమయంలో వివిధ అంశాల్లో చురుగ్గా ఉంటున్నారన్నారు. ముందుగానే అక్షరాలు, చదవడం, రాయడం నేర్పించడం వల్ల పాఠశాలల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గౌహర్ ఉన్నీష బేగం, సత్యవతి, విజయ కుమారి, గౌరి, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యంతో ఉపాధి


విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీవో సూర్యకుమారి

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా బాలిక, శిశు అభివృద్ధి అధికారి (జీసీడీవో) సూర్యకుమారి అన్నారు. గురువారం తాజంగి కస్తూర్బా గాంధీ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థినుల విద్యా ప్రగతిని పరిశీలించారు. వృత్తి విద్య కోర్సు ఐటీ-ఐటీఈఎస్ అమలుతీరును తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కస్తూర్బా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఐటీ-ఐటీఈఎస్ కంప్యూటర్ విద్యాబోధన అందిస్తున్నట్టు వివరించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లోనూ ఈ కోర్సుపై పరీక్ష రాయాల్సివుందన్నారు. ఈ కోర్సు నేర్చుకోవడం వల్ల ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అదనపు అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే, బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. పదోతరగతి, ఇంటర్‌ల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యలో వెనుకబడిన వి ద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. సుమ మాధురి, ఐటీ-ఐటీఈఎస్ ఉపాధ్యాయులు ఎం. నీలిమ పాల్గొన్నారు.

నేలలు విషపూరితం కాకుండా చూడాలి

» ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

చింతపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలలు విషపూరితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గురువారం పరిశోధన స్థానంలో ప్రపంచ మృత్తిక (మట్టి) దినోత్సవాన్ని శాస్త్రవేత్తలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ నేలలను సంరక్షించడం వల్ల పంటల్లో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు మితిమీరి వినియోగించడం వల్ల నేలలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటాన్నాయరు. అందువల్ల రైతులు సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువు వినియోగించాలన్నారు. పొలాల్లో పంట మార్పిడి చేసుకోవాలన్నారు. దీనివల్ల భూమిలో సూక్ష్మజీవులు పెరుగుతాయన్నారు. పంటలకు మంచి పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె. బయ్యపురెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, మృత్తిక శాస్త్రవేత్త పి. జోగారావు, శాస్త్రవేత్త బీఎన్ సందీప్ నాయక్ పాల్గొన్నారు.

బస్తర్ పిక్కల ధర పతనం

» గత వారం కిలో రూ.150 ... » ప్రస్తుతం కిలో రూ.30

» రైతులు గగ్గోలు


జీకే వీధి సంతలో వర్తకులు కొనుగోలు చేసిన బస్తర్ పిక్కలు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బస్తర్ పిక్కలు(తెల్ల పిక్కలు) ధర భారీగా పడిపోయింది. గత వారం కిలో రూ.150 పలికిన ధర గురువారం కిలో రూ.30లకు పడి పోయింది. దీంతోరైతులు ఆవేదన చెందుతున్నారు. జీకేవీధి వారప సంతలో గురువారం కిలో బస్తర్ పిక్కలను వ్యాపారులు రూ.30లకే కొనుగోలు చేశారు. గత వారం వీటి ధర రూ.150లు పలికింది. మార్కెట్ ప్రారంభంలో అధిక ధర లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం దిగుబడులు పెరగడం, ప్రభుత్వపరంగా మార్కెటింగ్ సదుపాయంలేకపోవడంతో వర్తకులు సిండికేట్‌గా మారి ధరను భారీగా తగ్గించేశారు. గత్యంతరం లేక రైతు లు కిలో రూ.30లకే విక్రయించారు. ఇప్పటికైనా ఐటీడీఏ, జీసీసీ అధికారులు స్పందించి బస్తర్ పిక్కలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి గిట్టుబాటు ధర అందించాలని రైతులు కోరుతున్నారు.

'ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి'

సీలేరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని స్థానిక గ్రామ సచివాలయం మహిళా కానిస్టేబుల్ రేవతి అన్నారు. గురువారం చింతపల్లి క్యాంప్‌లో లింగ ఆధారిత వివక్షత, సమానతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలబాలికలను సమానంగా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఈశ్వరమ్మ, ఆయా చంప, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

ఆటో అపహరణ

జి. మాడుగుల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లికి చెందిన ఊలంగి ఇస్సాకు చెందిన ఏపీ 39యూఈ 1332 నంబర్‌గల ఆటో బుధవారం రాత్రి అపహరణకు గురైంది. బాధితుడు కథనం మేరకు.. ఎప్పటిలాగే బుధవారం తన ఇంటి అవరణలో ఆటోను పార్కింగ్ చేసి నిద్రించారు. తెల్లారి చూసేసరికి ఆటో కన్పించలేదు. దీంతో గుర్తు తెలియని దుండగులు అపహరించినట్టు అనుమానంతో బాధితుడు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

మత్స్యగుండం శివాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు

» కలెక్టర్ దినేశ్‌కుమార్


కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ శాంతి కుమారి, ఆలయకమిటీ సభ్యులు


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

హుకుంపేట డిసెంబరు 5 మత్స్యగుండం శివాలయం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్టు కలెక్టర్ దినేశ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మఠం పంచాయతీ పరిధి మత్స్యగుండంను కలెక్టర్ దంపతులు సందర్శించారు. మత్యలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ప్రత్యేకతను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సర్పంచ్ శాంతికుమారి, కమిటీ సభ్యులు మత్స్య కొండ బాబు కలెక్టర్ దంపతులను సన్మానించారు. ఐటీడీఏ అభిషేక్ కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. మఠం జంక్షన్ నుంచి మత్స్యగుండం వరకు జరుగుతున్న రోడు పనులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ కోండయ్య పడాల్ తదితరులు పాల్గొన్నారు.

తరగతి భవనాలు పూర్తి చేయాలి: పీవో

ముంచంగిపుట్టు: అదనపు పాఠశాల భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశారు. మండలంలోని కిలగాడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో రూ.130 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అదనపు తరగతి నిర్మాణ పనులను గురువారం పీవో పరిశీలించారు. నాణ్యతతో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలను బోధించారు. మార్గదర్శిని కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మన్యపురట్లలో ఘనంగా నేలల దినోత్సవం



గ్రామ స్థితిగతులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నాతవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మన్యపురట్లలో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులు కలిసి ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామీణ స్థితిగతులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. గ్రామంలో నేలల రకాలు, గ్రామ సమస్యలు, పంటలు వంటి వాటిని చిత్రరూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుత నేల పరిస్థితులు, తిరిగి సారం పుంజుకోవడానికి ఆచరించవలసిన యాజమాన్య పద్ధతులను వివరించారు. సేంద్రియ ఎరువులు వాడడం, పచ్చిరొట్ట పైర్లను నేలలో కలియదున్నటం, పశువుల మంద కాయించడం, జీవన ఎరువులు వాడడం పంట మార్పిడి పద్ధతులు ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్, అనకాపల్లి భూసార పరీక్షా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ జె.ప్రసాద్, మాజీ సర్పంచ్ వనిమిన సూర్యారావు, మల్లారెడ్డి విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ సైన్సెస్ నాలుగో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జోగంపేటలో లేగదూడల ప్రదర్శన

గొలుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగంపేటలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. జోగంపేట గ్రామ జంక్షన్‌లో ఏర్పాటు కానున్న ఈ ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ బహుమతులతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న రైతులకు కూడా బహుమతులు అందిస్తామని వివరించారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులకు గురువారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రక్తపరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు రక్త నమూనాలు సేకరించి, రోగ నిర్ధారణ చేశారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నట్టు వైద్యాధికారి తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విద్యార్థులకు గోరువెచ్చని నీరు తాగేందుకు ఇవ్వాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రండి..రండి..రండి దయచేయండి

▸▸ ప్రభుత్వ పాఠశాలల్లో రేపు జరిగే తల్లిదండ్రుల సమావేశాలకు ఆహ్వానాలు ▸▸ చదువుకు చక్కని వాతావరణం కల్పించేందు సర్కారు కృషి



ఆహ్వానాలతో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు

మాకవరపాలెం/నాతవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల ఏడో తేదీ శనివారం చక్కని వాతవరణం కల్పించేందుకు విద్యాశాఖ సర్పంచ్‌లకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రికలను అందిస్తోంది. ఇందులో భాగంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులు పేరెంట్ కమిటీ ఛైర్మన్, సర్పంచ్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో పండుగలో భాగంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఓ వేదికపై చేర్చి విద్యాపరమైన అంశాలు చర్చించడంతో పాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు, పిల్లల ప్రగతి నివేదికలు అందజేయడం వంటివి జరుగుతాయని ఎంఈవో ఎంవీఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని పాఠశాల్లో విద్యార్థులే స్వయంగా ఆహ్వాన పత్రికలు తయారు చేశారన్నారు. అలాగే వీటి నిర్వహణకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పది మందిలోపు పిల్లలున్న బడులకు రూ.వెయ్యి నుంచి మూడువందల నుంచి నాలుగు వందల వరకు కేటాయించిందన్నారు. ఇదిలావుంటే, నాతవరం ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల ఏడో తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ జరిపేందుకు ఉపాధ్యాయులు ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో భాగంగా ఎంబీపట్నం హైస్కూల్ ఉపాధ్యాయులు చిరంజీవిపాత్రుడు తదితరులు ఎస్ఐ సిహెచ్.జభీమరాజుకు ఆహ్వానం పలికారు. అలాగే చమ్మచింత పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.జగన్నాథరావు తదితరులు పెద్దలకు ఆహ్వానాలను అందిస్తున్నారు.



నాతవరం ఎస్ఐకు ఆహ్వానం అందిస్తున్న ఎంబీపట్నం హైస్కూల్ ఉపాధ్యాయులు

కమ్యూనిటీ భవన నిర్మాణం పేరుతో నిధులు స్వాహా

▸▸ సర్పంచ్‌పై జమ్మాదేవిపేట గ్రామస్థులు ఆరోపణ ▸▸ చర్యలకు ఆందోళన

గొలుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ భవన నిర్మాణం పేరుతో నిధులు స్వాహా చేసిన సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని జమ్మదేవిపేటలో గురువారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీ శివారున ఉన్న జమ్మదేవిపేటలో తమ సొంత నిధులతో రామాలయం ఎదుట కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని అప్పట్లో సర్పంచ్ హామీ ఇచ్చారన్నారు. కమ్యూనిటీ భవన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు సొంత నిధులతో నిర్మించామని గ్రామస్థులు తెలిపారు. శ్లాబ్ ఏర్పాటుకు సుమారు రెండు లక్షల రూపాయలు ఖర్చు చేసి, రూ.నాలుగు లక్షల 83వేల నిధులు డ్రా చేసినట్టు గ్రామ సభలో వెల్లడి కావడంతో విషయం బయటపడిందన్నారు. దీనిపై స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులతో పాటు కార్యవర్గ సభ్యులు తెలిపారు. వెంటనే ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు చేపట్టాలని ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు, వార్డు సభ్యులు గొట్టేటి రాజబాబు, కూడా కాసులమ్మ, జమీలు, తాళాపు రాజులమ్మ, పంచాద నాగేశ్వరరావు, టీడీపీ మండల నాయకుడు బెల్లపు కొండలరావు తదితరులు కోరారు.



జమ్మదేవిపేటలో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ముమ్మరంగా వరి కోతలు

మాకవరపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ముగియడంతో గురువారం పెద్ద సంఖ్యలో రైతులు వరి కోతలు కోయడం ప్రారంభించారు. గతవారం రోజులు పాటు వర్షాలు కురవడంతో వరిచేళ్లు పూర్తిగా నేలకు ఒరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అష్టకష్టాలు పడి పడిపోయిన వరిచేళ్లను లేవదీశారు. ప్రస్తుతం వర్షం తెరిపివ్వడంతో మాకవరపాలెం, తామరం, గిడుతూరు, నారాయణరాజుపేట, జంగాలపల్లి, మల్లవరం, బయ్యవరం, లచ్చన్నపాలెం, పైడిపాల తదితర గ్రామాల్లో వరికోతలు ప్రారంభించారు. చాలాచోట్ల ఇవి ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కూలీల కొరత తీవ్రంగా ఏర్పడుతున్నట్టు పలువురు రైతులు వాపోతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉన్నందున మంచి దిగుబడి వస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.



మాకవరపాలెంలో వరికోతల్లో బిజీగా ఉన్న కూలీలు

ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న సభ్యులు

నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతి చెందిన నర్సీపట్నం ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యుడు ఏవీఎస్‌టీ శర్మ కుటుంబానికి విశాఖపట్నం పెన్షనర్స్ సంక్షేమ సమితి నుంచి రూ.70,150 చెక్కును గురువారం అందజేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ చేతుల మీదుగాశర్మ కుమారుడు రవికుమార్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బీవీఎస్ఎన్ రాజు, ట్రెజరర్ కె.సూర్యనారాయణ, కె.అప్పలనాయుడు, కె.రమణారావు, బొంతు గౌరినాయుడు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

రావికమతం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల ఆరు నుంచి 2025 జనవరి 9వ తేదీ వరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ బి.వెంకట రమణ తెలిపారు. ఈ సదస్సులలో భూముల విస్తీర్ణంలో వ్యత్యాసం, తప్పుగా నమోదైన సర్వే నంబర్ల మార్పు, సరిహద్దు వివాదాలు, భూకబ్జాలు, ఆక్రమణలు, రీ సర్వేల తప్పులు తదితర సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈనెల ఆరున తట్టబంద, 10న తోటకూరపాలెం, 11న గుడ్డిప, 12న గొంప, 13న చీమలపాడు, 16న చలిసింగం, 17న జెడ్.జెన్నవరం, 18న కొత్తకోట, 19న దొండపూడి, 20న మర్రివలస, మత్స్యవానిపాలెం, 21న జెడ్.కొత్తపట్నం,ధర్మవరం, 23న పి.పొన్నవోలు, 24న జి.చీడిపల్లి, 26న గుడివాడ, 27న మేడివాడ, 28న కొట్నాబిల్లి, కానాడ, 30న చినపాచిల,మత్స్యపురం, 31న గర్నికం,పెదపాచిల, 2025 జనవరి మూడున రావికమతం, గుమ్మాళ్లపాడు, నాలుగున కేబీపీ అగ్రహారం, కొమిర, ఆరున కవ్వగుంట, బుడ్డిబంద, 7న బాధనపాడు, 8న టి.అర్జాపురం,9న మరుపాక గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. రైతులంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

రోలుగుంటలో..

మండలంలో శనివారం నుంచి జనవరి 6వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ నాగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు కుసర్లపూడిలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో అన్ని రకాల భూ సమస్యలను పరిష్కరించడానికి చర్యలను తీసుకుంటామని, రైతులు అర్జీలను అందించవచ్చునని తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

▸▸ ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శోభారాణి




విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ శోభారాణి

చోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు, ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని ఉన్నత విద్యా శాఖ జోన్ వన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి సూచించారు. గురువారం ఆమె స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కాలేజీ రికార్డులు పరిశీలించడంతోపాటు, సబ్జెక్టుల అమలు, కాలేజీలో సమస్యలపై ప్రిన్సిపాల్, లెక్చరర్లతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన ఆమె, లెక్చరర్లు చెప్పే పాఠాలతోపాటు, ఇతర అంశాలలో కూడా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, బిచ్చమ్మ, లెక్చరర్లు రఫియుద్దీన్, సుధీర్, కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

చీడికాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని కోనాం హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు సూచించారు. మండలంలో కోనాం గిరిజన ఆశ్రమోన్నత పురుషుల పాఠశాలలో గురువారం 9, 10వ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థులకు వైద్య తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అవసరం మేరకు మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, భోజనానికి ముందు చేతులు కడిగించాలని ఉపాధ్యాయులను కోరారు. శిబిరంలో ఏఎన్ఎం రాజేశ్వరి, పాఠశాల హెచ్ఎం రమణమూర్తి, వార్డెన్ చలుగు జగన్నాథరావు, ఆశవర్కర్లు సేవలందించారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం రమేష్‌కుమార్

రోలుగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన జె.నాయుడుపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థి ఉల్లింగల హరీష్‌ను హెచ్ఎం రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు సాధించి పాఠశాలకు మంచిపేరును తీసుకురావాలని హెచ్ఎం ఆకాంక్షించారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

చీడికాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వైఈఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం తురువోలులో ప్రారంభమై సదస్సులు ప్రతి రోజూ ఆదివారం మినహాయించి ప్రభుత్వ కార్యాలయాలు పనిచేసే రోజుల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. జనవరి 8వ తేదీన బైలపూడిలో జరిగే సదస్సుతో ముగుస్తుందన్నారు. రైతులు వివిధ అర్జీలను అధికారులకు ఇవ్వాలని కోరారు.

దేవరాపల్లిలో..

మండలంలో ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ లక్ష్మీదేవీ తెలిపారు. ఈనెల 6న రైవాడ శివారు బేతపూడి ఉదయం 9నుంచి సాయంత్రం ఐదు వరకు జరుగుతుందని ఆమె తెలిపారు. జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె తెలిపారు.

గుంతల రోడ్లకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే బండారు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతల రోడ్లకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వడ్డాది నుంచి తాటిపర్తి వరకు 12.7 కిలోమీటర్లు మేర రూ. 23.59 కోట్లతో రోడ్డు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, రోడ్లు డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, గుంతల రోడ్లపై ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాలకు గురై చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. తాటిపర్తి వద్ద టూరిజం హబ్ ఏర్పాటు చేసేందుకు తాజ్ కంపెనీ ప్రతినిధులు వచ్చి రోడ్డు దుస్థితి చూసి తిరిగి వెళ్లిపోయారని, మరొక కంపెనీతో అక్కడ టూరిజం హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. వచ్చే సంక్రాంతికి రోడ్లు సిద్ధం చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యే అయిన ఆరు నెలల్లో నియోజకవర్గంలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పెద్దేరు జలాశయం ఆధునికీకరణను రూ.80 కోట్లతో పూర్తి చేస్తామన్నారు. మాడుగులలో ఐదు ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. తహసీల్దారు రమాదేవి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, అద్దిపల్లి జగ్గారావు, దేముడు, పుప్పాల అప్పలరాజు, సన్యాసిరావు, రమణ, కూటమినాయకులు పాల్గొన్నారు.

చీమలపాడు బాలలకు జనన ధ్రువీకరణ పత్రాలు

▸▸ కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ, విద్యా, పంచాయతీ అధికారులు

▸▸ తొలి రోజు 50 దరఖాస్తులు స్వీకరణ



గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రావికమతం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరు ఆదేశాలతో ఎట్టకేలకు గిరి బాలలకు జనన ధ్రువ పత్రాల మంజూరుకు రెవిన్యూ, పంచాయతీ, విద్యాశాఖ అధికారులు అడుగు వేశారు. మండలంలో చీమలపాడుతోపాటు పలు గ్రామాలలో గిరిజన విద్యార్థులకు జనన ధ్రువ పత్రాలు లేకపోవడం, ఆధార్ కార్డు, రేషన్ కార్డులు లేక పలువురు గిరి విద్యార్థులు అపార్ యాప్‌లో నమోదు కాలేదు. దీంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు జనన ధ్రువీకరణ పత్రాలు ఉంటే గాని అపార్ యాప్‌లో నమోదుకు సాధ్యపడడం లేదని వదిలేశారు. జనన ధ్రువీకర పత్రాలకు నోటరీ చేయించుకోవాలని తల్లిదండ్రులపై వత్తిడి తేవడంతో నోటరీకి రూ.మూడు వేల వరకు ఖర్చు అవుతున్నందున తాము చేయించలేమని చీమలపాడు పంచాయతీ గిరిజనులు ఆందోళనకు దిగారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టరు నోటరీ లేకుండా గిరి బాలలకు జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని ఆదేశించారని తహసీల్దార్ బి.వెంకట రమణ తెలిపారు. ఈ మేరకు చీమలపాడులో రెవిన్యూ, పంచాయతీ, విద్యాశాఖ అధికారులచే ప్రత్యేక సదస్సు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 మంది గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దరఖాస్తులను స్వీకరించినట్టు ఆయన చెప్పారు. వీటిలో పంచాయతీ కార్యదర్శి 45 దరఖాస్తులకు ఎన్‌వోసీలు ఇవ్వడంతో తక్షణమే గిరి బాలల జనన ధ్రువీకరణ పత్రాల మంజూరుకు నర్సీపట్నం ఆర్డీవో అనుమతులకు పంపామని తహసీల్దార్ చెప్పారు. ఆర్డీవో అనుమతులు వచ్చిన వెంటనే వీరందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు అందజేసి, అపార్ యాప్‌లో నమోదుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. ఇంకా ఎవరైనా ఉన్నా దరఖాస్తులు ఇస్తే వారికి జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సతీష్, ఎంఈవో తలుపులు, పంచాయతీ కార్యదర్శి పోలిరెడ్డి, వీఆర్వో సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

▸▸ జిల్లా వ్యవసాయాధికారి బి. మోహనరావు



రైతుల భూసార పరీక్షల కార్డులు అందజేస్తున్న మోహనరావు

చోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుని, ఆ తరువాతే ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి బి. మోహనరావు సూచించారు. గురువారం మండలంలోని వెంకన్నపాలెంలో ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విచ్చలవిడి ఎరువులు వినియోగం, వ్యర్థ ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో భూసారం దెబ్బ తినకుండా రైతులంతా భూమిని రక్షించుకోవాలని కోరారు. మట్టి ఎంత ఆరోగ్యంగా ఉంటే పంటలు బాగా పండుతాయని, భూమిలోని సారం పోకుండా కాపాడుకోవాలన్నారు. అందుకే ప్రతి రైతు మట్టి పరీక్షలు చేయిస్తూ సంప్రదాయ ఎరువులు వాడుతూ, భూమిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఏడీ వి. రవీంద్రనాధ్, ఏవో పావని, వెంకన్నపాలెం సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి రమణ, ఉద్యాన సహాయకులు మంజువాణి, విస్తరణాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోలుగుంటలో..

ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రోలుగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేల రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో విజయలక్ష్మి మాట్లాడుతూ పరిమితికి మించిన ఎరువుల వినియోగంతో నేలలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సేంద్రియ ఎరువులతో పంటలను పండించాలన్నారు. నేల పోషక విలువలు తెలుసుకోవడం ద్వారా ఏ పంట వేస్తే లాభాలు వస్తాయో వాటిని వేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎంవీ ప్రసాద్, ఏఈఓ ఉష, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తిచేయాలి

▸▸ ఉపాధి పథకం ఏపీడీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ శ్రీనివాసరావు

చీడికాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పండ్ల తోటల పెంపకంపై జిల్లా అధికారులు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయించాలని ఉపాధి పథకం ఏపీడీ శ్రీనివాస రావు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వీఆర్పీలు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మార్చి 31లోగా 110 ఎకరాల్లో పండ్లతోటలు వేయాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకూ 70 ఎకరాల్లో పూర్తిచేశారన్నారు. తోటల పెంపకానికి ముందుకొచ్చిన రైతుకు మొక్క వేసినప్పటి నుంచి మూడేళ్ల వరకు సంరక్షణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ప్రతీ కుటుంబానికి వంద రోజులు ఉపాధి పనులను కల్పించాలన్నారు. గోకులంషెడ్లు, నీటికుంట పనులు పురోగతి పెంచాలన్నారు. గృహాలు కట్టుకున్నవారికి 90 రోజుల్లో పూర్తిచేసి, వారికి వెంటనే వేతనాలకు సిఫార్సు చేయాలన్నారు. ప్లాంటేషన్ సూపర్‌వైజర్ కొర్రగింజల శ్రీనివాసరావు, ఈసీ జి.రమేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు బీఎస్.పాత్రుడు, రునాయుడు, మోహన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యం షష్ఠి రేపు

మాడుగుల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేజేపురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి కార్యక్రమాన్ని ఈనెల ఏడో తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండరావు తెలిపారు. ఉదయం నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, హోమాలు, పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. స్వామి వారికి పూజా సామగ్రితో భక్తులు తరలి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొనాలని రామకొండరావు కోరారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు మెగా సమావేశం

కె.కోటపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఈనెల ఏడో తేదీన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు జరుగుతాయని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ తెలిపారు. విద్యార్థుల ప్రగతి, వారి పురోభివృద్ధిపై చర్చించడం, చక్కని ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఈ సమావేశం తోడ్పడుతుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీడీవీ.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ వైర్లపై వేలాడుతున్న చెట్లకొమ్మలు తొలగించడంతోపాటు మరమ్మతులు చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గర్భకోశ వ్యాధుల నివారణకు దూడలకు టీకాలు

చీడికాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గర్భకోశ వ్యాధుల నివారణకు ఆవులు, గేదెల ఆడ పెయ్యిలకు బ్రూసెల్ టీకాలు వేయించాలని పెదగోగాడ పశువైద్యాధికారి కేవీఎస్.రాఘవమ్మ రైతులను కోరారు. గురువారం జి.కొత్తపల్లిలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరంలో ఆమె 300 పెయ్యిలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కె.అర్జున పాల్గొన్నారు.

నేడు 14 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చీడికాడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామాలకు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ నమ్మి వెంకటరావు తెలిపారు. మండలంలో అప్పలరాజుపురం, బి.సింగవరం, ఎల్‌బీ.పట్నం, ఖండివరం, వీరభద్రునిపేట, శిరిజాం, కోనాం, మంచాల, గుంటి, గుడివాడ, రెల్లపాలెం, ఎస్ఎన్.పురం, ఎల్ఎన్.పురం, గొప్పూరు ఉంటుందని వివరించారు.

పూతరేకులు C/o వేంపాడు

కుటీర పరిశ్రమగా అభివృద్ధి

- పది కుటుంబాలకే ఇదే ప్రధాన వ్యాపకం
- పూతరేకుల వ్యాపారం ద్వారా మరో ఇరవై మందికి ఉపాధి



నక్కపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం వేంపాడు... ఈ పేరు చెప్పగానే ఎవరికైనా ఠక్కున గుర్తుకొచ్చేది పూతరేకులు. ఇక్కడ ఒక సామాజిక వర్గానికి చెందిన వారు అనాదిగా పూతరేకులు తయారు చేస్తున్నారు.

తొలుత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం నుంచి ముడి పదార్థాలను (రేకులను) తెచ్చుకుని ఇక్కడ పూతరేకులు తయారు చేసి విక్రయించే వారు. క్రమంగా ముడిపదార్థాలను కూడా వీరే స్వయంగా తయారు చేసుకోవడం ప్రారంభించారు. కాలక్రమేణా వేంపాడులో పూతరేకుల తయారీ కుటీర పరిశ్రమగా వృద్ధి చెందింది. సుమారు పది కుటుంబాల వారు పూతరేకులను తయారు చేస్తుండగా, 20 మంది వ్యాపారులు స్టాల్స్‌లో వీటిని విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. పంచదార, బెల్లంతోపాటు జీడిపప్పు, బాదంపప్పు, పిస్తాపప్పు వంటి డ్రైఫ్రూట్స్‌తో పూతరేకులు తయారు చేస్తుంటారు.



పూతరేకులను తయారు చేస్తున్న దృశ్యం

బెల్లం, డ్రైఫ్రూట్స్ చేసే పూతరేకులకు డిమాండ్ అధికంగా వుందని తయారీదారులు చెబుతున్నారు. రకాలను బట్టి 10 పూతరేకులు వున్న బాక్సులు రూ.120 నుంచి రూ.180 వరకు విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వారు తమ బంధువులకు, ఉద్యోగులు తమ ఉన్నతాధికారులకు వేంపాడు పూతరేకులను బహుమతిగా అందజేస్తుంటారు. వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాల్లో వేంపాడు పూతరేకులను కూడా ఒక ఐటమ్‌గా పెడుతుండడంతో గిరాకీ పెరిగింది. ఒక్కో పూత రేకుపై రూ.2 నుంచి రూ.3 వరకు మిగులుతాయని, ఇళ్లల్లోనే పూతరేకులు తయారుచేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నామని చెబుతున్నారు.



రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోండి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలు భూ సమస్యలు, రీసర్వేలో అవకతవకల పరిష్కారానికి ఉపయోగపడతాయని



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి వీఆర్వో వరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది గ్రామ సభల్లో పాల్గొంటారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని, ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారని అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. సమస్యలు చెప్పుకోవడానికి వచ్చేవారు దరఖాస్తుతోపాటు సంబంధిత డాక్యుమెంట్లు కూడా తీసుకు రావాలని తెలిపారు. దరఖాస్తుదారులకు రసీదు ఇచ్చి 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని, దీనికోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా ఒక పర్యవేక్షణ బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని స్పీకర్ చెప్పారు.

రైస్ మిల్లుల అక్రమాలకు అధికారుల సహకారం

- సినీ నిర్మాత నట్టి కుమార్ ఆరోపణ

చోడవరం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాకు జిల్లా అధికారులు సంపూర్ణంగా సహకారం అందిస్తున్నారని సినీ నిర్మాత నట్టికుమార్ ఆరోపించారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఆధ్వర్యంలో ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సహకారం, ప్రోద్బలంతోనే జిల్లాలోని రైస్ మిల్లులు రేషన్ బియ్యం వ్యవహారంలో అక్రమాలకు పాల్పడుతున్నాయన్నారు. మండలంలోని ముద్దుర్తిలో గల వాసవీ రైస్‌మిల్లులో జరుగుతున్న అక్రమాలపై తాము ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీస్, పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా ఉదాసీనంగా వ్యవహరించడం చూస్తే...ఇంకా జగన్ పాలన కొనసాగుతున్నదని అనిపిస్తున్నదన్నారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమాలపై తాను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు, మంత్రి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిర్మాత నట్టి కుమార్

లోకేశ్‌కు కూడా ఫిర్యాదు చేశానన్నారు. జాయింట్ కలెక్టర్ ఇది చాలా చిన్న విషయమంటూ తేలిగ్గా తీసేశారన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఆ మిల్లును సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రైస్ మిల్లు నిర్వాహకులతో తనకు ఉన్న సివిల్ వివాదాన్ని ఈ వ్యవహారంతో ముడిపెడుతున్నారని, దానికీ, దీనికీ ఎలాంటి సంబంధం లేదని నట్టికుమార్ స్పష్టంచేశారు. రైసు మిల్లు నిర్వాహకులపై గతంలో చాలా కేసులు ఉన్నాయని, వారిపై కఠిన చర్యలు చేపట్టి మిల్లు సీజ్ చేయాలని నట్టికుమార్ డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా.. కళా ఉత్సవ్ ప్రారంభం



నడుపూరు పాఠశాల విద్యార్థినుల జానపద నృత్యం

భీమునిపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డైట్ కళాశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్ గురువారం నుంచి ఘనంగా ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పలు ప్రదర్శనలు ఇచ్చారు. నృత్యాలు, గీతాలాపనలతో సభికులు కేరింతలు కొట్టారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవ్‌లో మొదటి రోజు ఆరు పాఠశాలల నుంచి 75 మంది కళా కారులు హాజరయ్యారు. విద్యార్థిని స్నేహిత పాడిన జానపద గీతం అందరినీ ఆకట్టుకుంది. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తరుణ్, సాయి, కుమార్ బృందం జానపద యుగళ గీతానికి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అలాగే పలు పౌరాణిక, జానపద ప్రదర్శనలు, గీతాలు కూడా అలరించాయి. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి కుమారి, తదితరులు పాల్గొన్నారు.



విశాఖ పర్యటన నిమిత్తం గురువారం రాత్రి నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు

ఐటీ ఉద్యోగాల పేరిట టోకరా

... 5వ పేజీ తరువాయి

నిర్వహించింది. సుమారు 30 మందిని తీసుకుంది. వారికి అన్నీ కలిపి ఏడాదికి రూ.1.8 లక్షల జీతం ఇస్తామని ఆఫర్ లెటర్ ఇచ్చింది. అంటే నెలకు సుమారు రూ.15 వేల జీతం. ఎటువంటి అనుభవం లేనందున, శిక్షణ ఇవ్వాలి కాబట్టి, అది పూర్తయ్యాక వెళ్లిపోకుండా ఉండడానికి డిపాజిట్ కట్టాలని ఒత్తిడి పెట్టింది. కొందరి వద్ద రూ.3 లక్షలు, మరికొందరి వద్ద రూ.6 లక్షలు చొప్పున వారి తల్లితండ్రుల నుంచి అడ్వాన్స్ చెక్కులు తీసుకుంది. మూడు నెలల ప్రొబేషన్ తరువాత రెగ్యులర్ చేస్తామని, అప్పుడు జీతం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చింది. యువతీ యువకులు ఉత్సాహంగా చేరారు. అయితే వారిలో 80 శాతం మందికి ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ఏ బాధ్యత అప్పగించలేదు. నెల నెలా జీతం మాత్రం ఇచ్చింది. ఏదైనా పని చెప్పాలని కొందరు కోరితే...'మీకు ఏమి చేతనవుతుంది? ఏమీ చేయలేరు.' అంటూ కంపెనీ ప్రతినిధులు ఎగతాళి చేయడం ప్రారంభించారు. తాము చేరి మూడు నెలలు దాటింది కాబట్టి జీతం పెంచాలని నలుగురైదుగురు కోరగా, 'ఇదే మీకు ఎక్కువ' అంటూ వెటకారం చేశారు. దాంతో తాము ఉద్యోగం మానేస్తామని, సర్టిఫికెట్లు వెనక్కి ఇవ్వాలని కోరితే వారిని మరింత వేధించడం ప్రారంభించారు. మూడు నెలల ముందు నోటీసు ఇవ్వడంతో పాటు రూ.3 లక్షలు కట్టాలని, అప్పుడే సర్టిఫికెట్లు, అడ్వాన్స్ చెక్కులు వెనక్కి ఇస్తామని నిబంధన పెట్టారు. ఇచ్చిన జీతం లక్ష రూపాయలు కూడా లేదని, మూడు లక్షలు ఎందుకు ఇస్తామని అడిగితే, నచ్చింది చేసుకోండి..అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దాంతో వారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. నగరంలోని ఓ ఎమ్మెల్యేను కలిసి జరిగిందంతా వివరించారు. ఆ కంపెనీ తన నియోజకవర్గంలోనే ఉండడంతో ఆ పోలీస్ స్టేషన్ అధికారికి ఫోన్ చేసి, పిల్లలకు న్యాయం చేయాలని సూచించారు. అక్కడ ఈ పంచాయితీ మూడు రోజులు నడిచింది. పిల్లలను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించుకొని కింది స్థాయి అధికారి యాజమాన్యానికి వత్తాసు పలికారు. ఈ విషయం మళ్లీ ఎమ్మెల్యేకు చెప్పడంతో, ఆయన స్టేషన్ అధికారికి మరోసారి ఫోన్ చేశారు. ఒక్కొక్కరు రూ.1.5 లక్షలు చొప్పున చెల్లిస్తే తప్ప సర్టిఫికెట్లు ఇవ్వడానికి కంపెనీ ప్రతినిధులు ఒప్పుకోకపోవడంతో ఆ ఒప్పందం ప్రకారం ఆ కేసు సెటిల్‌మెంట్ చేశారు. డబ్బులు కట్టాకే వారి సర్టిఫికెట్లు వెనక్కి ఇచ్చారు.

తొలి వారం.. పోటెత్తిన భక్త జనం

- కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు
- కిటకిటలాడిన క్యూలైన్లు
- ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఒకే విధంగా రద్దీ

జగదాంబ కూడలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా తొలి గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున మూడు గంటల నుంచే ఆలయంలోని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. నగరంలోని నలు మూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల నుంచి కూడా



భక్తులతో కిటకిటలాడిన క్యూ లైన్లు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వీఐపీలు, వీవీఐపీలతో సంబంధం లేకుండా సాధారణ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో ఉన్న వారికి ఈవో తాగునీరు, మజ్జిగ, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఏవీఎన్ కాలేజీ నుంచి బస్సులను మళ్లించగా, టౌన్ కొత్త రోడ్డు వద్ద వాహనాల ప్రవేశాన్ని నిషేధించారు. రీడింగ్ రూమ్ నుంచి కురుపాం మార్కెట్ వరకు రహదారి క్లియర్‌గా ఉండడంతో భక్తులకు ఇబ్బందులు కల గలేదు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

గంజాయి కేసులో ఎట్టకేలకు నిందితుడి అరెస్టు

- ఎనిమిదేళ్ల తరువాత పట్టుకున్న పోలీసులు
- బెంగళూరు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నిందితుడు
- పీటీ వారెంట్‌పై విశాఖ తీసుకువచ్చి.. కోర్టులో హాజరు

నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల క్రితం నమోదైన గంజాయి రవాణా కేసులో పరారీలో వున్న నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇతను కర్ణాటకలో మరో గంజాయి కేసుకు సంబంధించి అక్కడ పోలీసులు అరెస్టు చేయడంతో రెండేళ్ల నుంచి బెంగళూరు జైలులో రిమాండ్ ఖైదీగా వున్నాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న నర్సీపట్నం పోలీసులు పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి గురువారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి ముందు హాజరు పరిచారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి...

చింతపల్లి మండలం చౌడుపల్లి గ్రామానికి చెందిన వంతల కేశవరావు 2016లో గంజాయి రవాణా చేస్తూ పోలీసులను చూసి పారిపోయాడు. దీంతో నర్సీపట్నం రూరల్ పోలీసులు 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. అయితే కేశవరావు అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగున్నాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం గంజాయి సాగు, రవాణాను పూర్తిగా నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. గతంలో గంజాయి కేసుల్లో పాత నేరస్థులు, నిందితులుగా వుండి పోలీసులకు పట్టుబడని వారి వివరాలను బయటకు తీశారు. వీరిలో వంతల కేశవరావు కూడా వున్నాడు. ఆధార్ నంబర్ ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన పోలీసులు, నిందితుడు కేశవరావు బెంగళూరు జైలులో రిమాండ్ ఖైదీగా వున్నట్టు గుర్తించారు. 2022లో అక్కడ 60 కిలోల గంజాయితో పట్టుబడినట్టు కేసు వుంది. నర్సీపట్నం రూరల్ ఏఎస్ఐ రమణ, ఇద్దరు కానిస్టేబుళ్లు ఇటీవల బెంగళూరు సెంట్రల్ జైలుకు వెళ్లారు. అక్కడ కోర్టులో మెమో దాఖలు చేసి న్యాయస్థానం అనుమతితో కేశవరావును పీటీ వారెంట్ మీద విశాఖపట్నం తీసుకువచ్చారు. గురువారం విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో విశాఖపట్నం సెంట్రల్ జైలుకి తరలించారు.

మెగా పేరెంట్, టీచర్ మీట్ రేపు

- కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న మెగా పేరెంట్, టీచర్ మీట్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన ఆహ్వాన పత్రికలను తల్లిదండ్రులకు అందజేసినట్టు తెలిపారు.

ఇన్‌చార్జులతో కాలక్షేపం!

... 5వ పేజీ తరువాయి

పర్యవేక్షించి, అవసరమైన వైద్య సేవలు అందించాల్సిన సహాయక వైద్యాధికారి పోస్టు కూడా ఏడాది నుంచి ఖాళీగానే వుంది. విశాఖపట్నం నుంచి ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగించి కాలక్షేపం చేస్తున్నారు. జోనల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టు గత ఏడాది డిసెంబరు నుంచి భర్తీకి నోచుకోలేదు. ఇక్కడ కూడా ఇన్‌చార్జి అధికారే వున్నారు. పూర్తికాల అధికారి లేకపోవడంతో పట్టణంలో ఆశీలు పాటల నిర్వహణ, దుకాణ సముదాయాల అద్దెలు, ఇంటి పన్నుల వసూళ్లు మందగించాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ స్పందించి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పూర్తిస్థాయి అధికారులను నియమించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మూగబాలికపై అత్యాచారం

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల మూగబాలికపై ఒక కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలికకు రక్తస్రావం జరగడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించగా దారుణం బయటపడింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలికకు మాటలు రాకపోవడంతో ఇంటి వద్దనే ఉంటోంది. బాలిక కుటుంబానికి పరిచయస్తుడైన వాడమొదలు శ్రీనివాసరావు (30) పెయింటింగ్ పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో ఉంటున్నాడు. ఈనెల మూడో తేదీన బాలిక వీధిలో ఆడుకుంటుండగా శ్రీనివాసరావు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకువెళ్లాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో బాలిక భయపడిపోయింది. బాలికకు రక్తస్రావం జరగడంతో బుధవారం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ బాలికను గట్టిగా ప్రశ్నించేసరికి అసలు విషయం బయటపడింది. దీంతో బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు శ్రీనివాసరావుపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్టు సమాచారం. దీనిపై పోలీసులను వివరణ కోరగా బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని, నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

క్రైం... crime news

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

రోలుగుంట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఏర్పడిన కలహాలతో మనస్తాపం చెందిన ఒక వివాహితో ఉరివేసుకుని ఆత్మహత్య చేసకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ రామకృష్ణారావు అందించిన వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎన్.కొత్తూరు గ్రామానికి చెందిన రెడ్డి అప్పలనాయుడుకు 2015లో నర్సీపట్నం మండలం సుబ్బారాయుడుపాలెం గ్రామానికి చెందిన మంగ (32)తో వివాహం అయ్యింది. ప్రస్తుతం వీరికి ఇద్దరు పిల్లలు వున్నాయి. అప్పలనాయుడు కొంతకాలం నుంచి రోజూ మద్యం తాగుతుండడంతో ఇద్దరి మధ్యా మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్త కుటుంబ పోషణను పట్టించుకోకపోవడం, పిల్లలను సరిగా చూడకపోవడంతో మంగ మనస్తాపం చెందింది. బుధవారం రాత్రి భర్త, పిల్లలు ఒక గదిలో నిద్రించగా, మంగ మరో గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఉదయం నిద్రలేచిన తరువాత అప్పలనాయుడు, పిల్లలు ఈ దృశ్యాన్ని చూసి ఇరుగుపొరుగు వారికి చెప్పారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి తల్లి రామయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

చెట్టు పైనుంచి పడి ఒకరి మృతి



గంగరాజు (ఫైల్)

నక్కపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు గురువారం ఉదయం ప్రమాదవశాత్తూ చెట్టు పైనుంచి పడి మృతి చెందినట్టు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గొడిచెర్లకు చెందిన అల్లు గంగరాజు(28) తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం మేకలకు వేపకొమ్మలను కోసేందుకు తన సోదరుడు నాగేశ్వరరావుతో కలిసి గ్రామానికి దూరంగా వున్న వేపచెట్టు వద్దకు వెళ్లాడు. గంగరాజు కర్రకు పదునైన కత్తి కట్టి చెట్టు ఎక్కి వేప కొమ్మలు కోస్తుండగా కత్తి జారి అతని చేతికి బలంగా తగలడంతో గాయమైంది. ఈ క్రమంలో అతను చెట్టు పైనుంచి కింద పడిపోవడంతో సోదరుడు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. గంగరాజును ఆస్పత్రికి తీసుకు వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు పదేళ్లు జైలు శిక్ష

నర్సీపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ విశాఖపట్నం మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ బుధవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. 2018వ సంవత్సరంలో గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట సమీపంలో కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని నర్సీపట్నం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని కిల్లో జెన్ను, కిల్లో కమల, కిల్లో సీతలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుని అప్పటి ఎక్సైజ్ సీఐ డీవీజీ రాజు ఆధ్వర్యంలో విచారించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితులపై మోపిన నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గవరపాలేనికి చెందిన మహిళ తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైనట్టు గురువారం పోలీసులకు ఫిర్యాదు అందింది పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక కోటవీధికి చెందిన శరగడం హేమ తన ఇద్దరు పిల్లలతో కొంతకాలంగా పల్లపువీధిలోని పుట్టింట్లో ఉంటోంది. గత నెల 28వ తేదీ ఉదయం మార్కెట్‌కు వెళ్లి వస్తానని తల్లికి చెప్పి తన ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త మహాలక్ష్మీనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

విశాఖపట్నం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా శుక్రవారం నుంచి 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఇక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గీతం యూనివర్సిటీ వేదికగా డిసెంబరు 6 నుంచి 12వ తేదీ వరకు యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో నుంచి 200 మంది యువతీ యువకులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమ్మేళనంలో గిరిజన సంస్కృతి, వారి అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు పలు అంశాలపై యువతకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614